# ఐక్య ఉపాధ్యాయ

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ అధికార పత్రిక

సంపుటి - 7 సంచిక -05 కృష్ణా/విజయవాడ మే - 2026 పేజీలు - 36 రూ.20.00

MAYDAY



## అమరజీవి కా॥ దాచూరి రామిరెడ్డి



పాఠశాల విద్యాశాఖ కమీషనర్ తమీమ్ అన్సారియా ద్వారా
ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం పోస్టర్ ఆవిష్కరణ



10వ తరగతి స్పాట్ వాల్యుయేషన్ సెంటర్లలో ఎదురవుతున్న సమస్యలపై
డైరక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్ వారికి యుటియఫ్ రాష్ట్ర కమిటీ ప్రాతినిధ్యం



సప్లిమెంటరీ ఏరియల్ బిల్స్, రిటైర్మెంట్ చేసిన బిల్స్ సబ్మిట్ విషయంపై
డైరక్టర్ ఆఫ్ ట్రజరీస్ వారికి యుటియఫ్ రాష్ట్ర కమిటీ ప్రాతినిధ్యం



పాఠశాల విద్యాశాఖ కమీషనర్ తమీమ్ అన్సారియా గారికి
ఉపాధ్యాయుల సమస్యలపై యుటియఫ్ రాష్ట్ర ప్రాతినిధ్యం

# గిరిజన ఉపాధ్యాయుల రాష్ట్ర సదస్సు

**12.04.2024, రంపచోడవరం**



యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు



పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి



యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్



పిడిఎఫ్ పూర్వ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు



యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు



యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్

# ఐక్యఉపాధ్యాయ
## విద్యా విషయక మాసపత్రిక



### సంపాదక వర్గం

**కె.సురేష్ కుమార్**
ప్రధాన సంపాదకులు

**సంపాదకవర్గ సభ్యులు**

కె.ఎస్.ఎస్.ప్రసాద్
నక్కా వెంకటేశ్వర్లు
సిహెచ్.శ్రీహరి
సిహెచ్.శ్రీనివాసరావు
ఎం. లలితశ్రీ


### ఈ సంచికలో...


| | |
|---|---|
| పద వికాసం | - 04 |
| యాపిల్ గింజల మామయ్య | - 05 |
| జాతీయం - అంతర్జాతీయం | - 06 |
| ఏపి పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఆర్డర్-2025 | - 07 |
| పోరాటాల ద్వారానే గిరిజన హక్కులకు.. | - 09 |
| అసంఘటిత ఉపాధ్యాయులు | - 10 |
| గిరిజన సంక్షేమ టీచర్ల రాష్ట్ర సదస్సు | - 11 |
| అధ్యయనం ఆచరణతోనే సాధ్యం | - 13 |
| మహిళా టీచర్ల సమస్యలపై ఉద్యమిద్దాం | - 15 |
| ప్రశ్నోత్తరాలు | - 16 |
| చైతన్యం -- సవాళ్ళు | - 17 |
| ఛలో సిఎంఓ కేసు కొట్టివేత | - 19 |
| కార్మిక వర్గ ఐక్యతే భవిష్యత్తు | - 20 |
| నిరంతర కృషీ వలుడు | - 22 |
| ఉద్యమ వార్తలు | - 24 |
| ప్రభుత్వ ఉత్తర్వులు | - 33 |



| | | |
|---|---|---|
| 5 సం॥ చందా | : ` | 850-00 |
| 2 సం॥ చందా | : ` | 375-00 |
| సం॥ చందా | : ` | 200-00 |

**Union Bank Online**
A/c No. 346402010025027
IFSC Code : UBIN0534641



**ఐక్యఉపాధ్యాయ**
యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి
గవర్నర్‌పేట, విజయవాడ-520002
Ph.No. : 0866-2973763
MobileNo. : 9494112533
Website : www.aputf.org
E-mail : ikyopadhyaya1975@gmail.com


# "నారీ శక్తి" – విఫల రాజకీయ కుట్ర

"మహిళా రిజర్వేషన్ బిల్లును విపక్షాలు అడ్డుకొని ఓడించడం ద్వారా దేశ మహిళలందరికీ తీరని అన్యాయం చేస్తున్నారం"టూ రాష్ట్రాల ఎన్నికలు జరుగుతున్న వేళ "మన్ కీ బాత్" వేదికగా దేశ ప్రధాని ఎన్నికల కోడ్ ను సైతం ఉల్లంఘించి ప్రసంగించడం ప్రధాని కపటనాటకంలో భాగమని అందరికీ అర్థం అయింది.

వాస్తవానికి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశ పెట్టాలనుకున్నది మూడు బిల్లులు. అవి పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లు మరియు పార్లమెంట్ నియోజక వర్గాల పునర్విభజనకు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు. అయితే మొదట ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు ఓడించాయి. దాంతో మహిళా రిజర్వేషన్ల బిల్లుతో సహా మిగిలిన రెండు బిల్లులను ప్రవేశ పెట్టకుండానే ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఇక మహిళా బిల్లును వ్యతిరేకించడం అనే ప్రశ్నే లేనప్పుడు మహిళలకు అన్యాయం చేయడం ఎలా? నిజానికి ఆ పని చేసింది మహిళా రిజర్వేషన్స్ పట్ల చిత్తశుద్ధి లేని ప్రభుత్వమే. ఏమైనా మహిళా బిల్లును నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్)తో ముడిపెట్టి దేశ రాజకీయాలను తనకనుకూలంగా మార్చుకొని లబ్ది పొందాలన్న ప్రభుత్వ కుట్రలను ప్రతిపక్షాలు వమ్ము చేయడం మంచిదే .

2023లో 106వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంట్ ఆమోదించిన నారీ శక్తి విధాన్ అభయాన్ (మహిళా రిజర్వేషన్ చట్టం)ను 2024లో అమలు చేయకుండా పై చట్టంలోనే జనగణన, ఆ తర్వాత డీలిమిటేషన్ అంటూ లంకె పెట్టి ఇప్పుడు జనగణన కంటే ముందే బి జె పి తన రాజకీయ లబ్ది కోసం హడావుడిగా డీలిమిటేషన్ ను మహిళా బిల్లు సవరణతో ముడిపెట్టి పబ్బం ప్రస్తుతం రాష్ట్రాలకు జరుగుతున్న ఎన్నికల్లో కూడా లాభం పొందాలనుకున్నది. డీలిమిటేషన్ ద్వారా బిజెపికి రాజకీయంగా బలంగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెంచుకోవడం, చారిత్రకంగా బిజెపి బలహీనంగా ఉన్న దక్షిణాది, తూర్పు, ఈశాన్య రాష్ట్రాలలో ఎం పి స్థానాల సంఖ్య కుదించడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేసి, దానికి మహిళా ఉద్ధరణ ముసుగు తొడిగిందని జరిగిన పరిణామాలను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. ఎందుకంటే, 2023లో తానే తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ చట్టం ఎందుకు అమలు చేయలేదు? అప్పుడు కూడా తదుపరి జనగణన ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేస్తామంది. ఆ ప్రతిపాదనపై ప్రతిపక్షాలు నిరసించాయి. ఇప్పుడున్న సీట్లకు 2024 నుంచే మహిళలకు రిజర్వేషన్లు అమలు చేసి ఉంటే మహిళలకు చట్టసభల్లో 33 శాతం ప్రాతినిధ్యం దక్కేది.

2021లో జనగణన జరగాల్సి ఉండగా పలు కారణాలతో వాయిదా వేసింది. ఇప్పుడు ఉన్నట్టుండి 2011 జనాభా ఆధారంగానే మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ అంటుంది. ప్రస్తుతం జనగణనతో పాటు కుల గణన కూడా జరుగుతుంది. ఒక వేళ దాని ఆధారంగా ఎస్సీ, ఎస్టీ ల సీట్లు కూడా పెరిగితే ఆ మేరకు సామాజిక న్యాయం జరుగుతుంది. ఇవేమీ పట్టించుకోకుండా వచ్చే ఎన్నికలనాటికి సీట్ల సంఖ్య పెంచుకోవాలనే తపనలోనే ప్రభుత్వం ఉందని అర్థమవుతుంది. సీట్ల పెరుగుదల వల్ల రాష్ట్రాలకు అన్యాయం జరగదంటూ ప్రభుత్వం చేస్తున్న వాదన పచ్చి మోసంతో కూడుకున్నది.

ప్రస్తుతం 1971 జనాభా లెక్కల ప్రకారం లోకసభ స్థానాల సంఖ్య నిర్ణయించబడి కొనసాగించ బడుతోంది. మన రాష్ట్రంతో పాటు దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలను విజయవంతంగా అమలు చేశాయి. 'బిమారు' రాష్ట్రలు అంటే బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి చోట్ల జనాభా నియంత్రణ సరిగ్గా అమలు చేయలేదు. కాబట్టి 1971 నాటి దామాషాలో రాష్ట్రాలకు సీట్ల కేటాయింపు ఉండాలని జనాభాను తగ్గించిన రాష్ట్రాలు కోరడం అత్యంత సమంజసం. ఈ కారణంతోనే గత 50 సంవత్సరాలుగా ప్రభుత్వాలు ఈ పని చేయలేదు. ఎవ్వరికీ సీట్లు తగ్గవంటూ ప్రభుత్వ పెద్దలు ఇచ్చే హామీలు నోటి మాటలే తప్ప బిల్లులో పేర్కొనలేదు. మన రాష్ట్రానికి ఇంతగా అన్యాయం చేస్తున్న బిజెపికి, అది ప్రతిపాదించిన బిల్లులకు ఇక్కడి అధికార టిడిపి, ప్రధాన ప్రతిపక్షం వైసిపి బేషరతుగా మద్దతివ్వడం ఈ రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచేయడమే. టిడిపి, వైసిపిలు బిజెపి వద్ద మరోసారి లొంగుబాటును ప్రదర్శించడం రాష్ట్రానికి ద్రోహం చేయడమే. పైగా రాజ్యాంగానికి, సమాఖ్య స్ఫూర్తికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా, ఎలాంటి సంప్రదింపులూ లేకుండా, ఏకపక్షంగా, ప్రాంతీయ సమతల్యతను కాలరాసే బిజెపి పన్నాగాలను వ్యతిరేకించిన ప్రతిపక్షాలను ఆ పార్టీలు తూలనాడటం అభ్యంతరకరం.

లోక్ సభలో మహిళా రిజర్వేషన్లను ఎవ్వరూ వ్యతిరేకించలేదు. కుట్రపూరిత డీలిమిటేషన్ తో లంకె పెట్టిన 131వ రాజ్యాంగ సవరణను తిప్పికొట్టాయి. మోడీ ప్రభుత్వం ఇంతకాలం నిద్రాణంలో ఉంచిన మహిళా రిజర్వేషన్ చట్టం చెల్లుబాటుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల ప్రారంభం రోజున గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. దాని ప్రకారం వచ్చే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్స్ అమలు చేయవచ్చు . అందుకు పట్టుబట్టాల్సింది పోయి టిడిపి, వైసిపిలు బిజెపికి అంతకాగడం ఆత్మహత్యా సదృశ్యం. మెజారిటీ లేకపోయినా బిల్లు పెట్టడంలోనే బిజెపి కపటం తెలుస్తుంది. బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న కుట్ర దాగుంది. గనుక, దేశ ప్రజలు, ప్రత్యేకించి మహిళలందరూ బి జె పి కుయుక్తులను అర్థం చేసుకోవాలి. మహిళా రిజర్వేషన్ అమలయ్యేదాకా విరామమెరుగక పోరాడాలి. 'నారీ శక్తి' సత్తా చాటాలి!

**'నారీ శక్తి' సత్తా చాటాలి!**


PRINTED AND PUBLISHED BY **KANDALA SATYA SUBRAHMANYA PRASAD**, ON BEHALF OF A. P.UNITED TEACHERS FEDERATION, PRINTED AT PRAJASAKTI PRINTERS&PUBLISHERS PVT LTD, D.NO.27-30-4, AKULAVARI STREET, GOVERNERPET, VIJAYAWADA- 520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT A. P.UNITED TEACHERS FEDERATION, 27-31-11, PALAPARTHIVARI VEEDHI, GOVERNERPET, VIJAYAWADA.520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH. **EDITOR : K SURESH KUMAR**

## పద వికాసం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | | | 3 | 4 | | |
| 5 | | | | 6 | | | | 7 |
| 8 | | | 9 | | | | 10 | |
| | | 11 | | | | 12 | | |
| 13 | | | | | 14 | | | |
| | | | | 15 | | | | |
| 16 | | | 17 | | | | 18 | 19 |
| | | 20 | | | | 21 | | |
| | 22 | | | | 23 | | | |

## గత ఏప్రిల్ నెల సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 జ | 2 న | ని | | 3 మే | 4 న | ల్లి | |
| 5 మ | | టి | | 6 గి | | రి | | 7 ఉ |
| 8 కాం | తి | | 9 మ | రీ | చి | | 10 పా | ప |
| | | 11 వి | | శ | | 12 మం | | కా |
| 13 అ | ప | రా | లు | | 14 అం | ధ | కా | రం |
| | | ట | | 15 సీ | | ర | | |
| 16 కు | లూ | | 17 వా | త | ము | | 18 లో | 19 భి |
| ట్ర | | 20 గా | | క్క | | 21 మొ | | న్నం |
| | 22 కు | జా | డు | | 23 ప | ల్ల | ము | |

### ఆధారాలు

- యం. జోగిరాజు

**అడ్డం**

1) ఆస్ట్రియా రాజధాని
3) అగర్తల ఏ రాష్ట్ర రాజధాని
8) చదువు, జ్ఞానం
9) చేదు కాయ
10) అక్క భర్త
13) ఆంగ్ల రెండోనెల
14) శివరాత్రికి చేసేది
16) ఒక నది
17) ఒక పువ్వు
18) హిట్లర్ పార్టీ పేరు
22) భూమి శిస్తు
23) అరుణాచల్ ప్రదేశ్ సీ.యం

**నిలువు**

2) పద్య లక్షణాలలో ఒకటి
4) నెమలి పింఛం
5) స్వర్గం
6) క్షుత్తు
7) దిద్దుబాటు
11) భూమి
12) బంగారంతో చేసేవి
15) నెమ్మది
16) ఒకటిన్నర అడుగు
19) ఆత్మను ఇలా కూడా అంటారు.
20) గంగూలీని ఇలా ఇష్టంగా పిలుస్తారు.
21) అపస్మారక స్థితి.

- (సమాధానాలు వచ్చే సంచికలో)

### పాఠకులకు సూచన

పూర్తి చేసిన పదవికాసం 2026 మే 20లోగా ఐక్య ఉపాధ్యాయ పత్రికకు పోస్టు ద్వారా పంపాలి. కరెక్టుగా పూర్తి చేసి పంపిన పాఠకుల పేర్లు వచ్చే సంచికలో ప్రచురించ బడతాయి. సమాధానాలు పంపిన మొదటి పదిమందికి తగిన బహుమతి అందజేయబడుతుంది.

### పద వికాసం ఏప్రిల్ నెల విజేతలు

1. కె.వరప్రసాద్ గన్నవరం, కృష్ణా జిల్లా (మెయిల్)
2. ఈదే వెంకటభరత కుమారి తిరువూరు, ఎన్.టి.ఆర్.జిల్లా
3. డా॥ మొగ్రీ పిచ్చయ్య గిద్దలూరు (మం), మార్కాపురం (మెయిల్)
4. షేక్ బాజీ తిరువూరు (మం), ఎన్.టి.ఆర్. (మెయిల్)
5. ఐ.డి.కె.డి.రాజేశ్వరి రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా
6. ఎం.పిచ్చయ్య గిద్దలూరు, మార్కాపురం జిల్లా (మెయిల్)
7. ఎస్.కె.ఏ.కె. జిలాన్ మార్కాపురం జిల్లా (మెయిల్)
8. షేక్ షావలి వివడలూరు (మం), నెల్లూరు జిల్లా (మెయిల్)

విజేతలకు అభినందనలు. బహుమతి త్వరలో అందజేయబడుతుంది.

## విత్తు భాష్యం

- చిలుకూరి శ్రీనివాసరావు,
ఐక్యఉపాధ్యాయ పత్రిక సంపాదక సభ్యులు

నీళ్లు లేకపోయినా
సాకేవాళ్లు
కానరాకపోయినా
రాలిపడ్డ గింజ
రాళ్లన్న చీల్చుకుంటూ
మొక్కైలేచి
నిండుగా
ఫలించి
సార్థకమవుతోంది;
అన్నీ ఉన్న జనం
రాళ్లను మొక్కుతూ
పొరుగు వాళ్లని తొక్కుతూ
మొండుగా
స్వార్థపరులౌతున్నారు
మనమెప్పటికీ
చిన్న విత్తుకి
సాటికాలేమా?!






ఎం. జోగిరాజు
కృష్ణా జిల్లా

పుస్తక సమీక్ష

ఈ కథ నిజంగా జరిగింది. రెండొందల ఏళ్ళ కిందట– అమెరికా లోని మసాచు సెట్స్ అనే ప్రాంతం లో లియో మినిస్టర్ అనే ఊరిలో 1774 సెప్టెంబర్ 24న పుట్టిన ఒక మంచి మనిషి కథ ఇది. అందరి కోసం బతికిన మనిషి కథ. అతని పేరు జానీ చాప్మెన్. అయితే అందరూ అతడ్ని 'యాపిల్ గింజల మామయ్య' అనేవారు.

ఈ మామయ్య ఒక అద్భుతం చేసి చూపించాడు. తనొక్కడే కొన్ని లక్షల మొక్కలను పెంచాడు. అందుకోసం చలిని, ఎండను లెక్కచేయలేదు. దేనికీ, ఎవరికీ భయపడలేదు. వేలకొద్దీ మైళ్ళు కాలినడకన తిరిగాడు. చెట్ల కింద, పుట్టల మధ్య నిద్రపోయాడు. ఏది దొరికితే అది తిన్నాడు. అందరికీ సాయం చేసాడు.

జానీ మామయ్య నాటిన చెట్లు నేటికీ ఉన్నాయి. అవి ఒంటినిండా యాపిల్ పళ్లతో – అచ్చం అతడి మనసులా కనిపిస్తున్నాయి. జానీ చాప్మెన్ కథ చదివాక – ఇలాంటి పని మనమూ చేస్తే!... అనిపిస్తుంది. అతనొక్కడే కొన్ని లక్షల మొక్కలు పెంచాడు. మనం కనీసం ఒక పది చెట్లయినా పెంచలేమా అనిపిస్తుంది. అలా అనిపించక మానదు. ఈ కథలో అంత శక్తి ఉంది.

జానీ మామయ్య అమెరికాలోని తూర్పు భాగంలో ఉండేవాడు. మంచిగా బతకాలని అప్పటికే చాలా మంది అక్కడి నుంచి వెళ్ళిపోయారు. ఇప్పుడు మిగిలిన వారిలో కూడా అనేకమంది పడమటి వేపు వలసపోతున్నారు.

పడమటి దేశంలో ఇళ్లు లేవు. ఊళ్ళు లేవు.రోడ్లు గట్రా అంతకన్నా లేవు. అక్కడ ఆదివాసీలు (గిరిజనులు) మాత్రమే ఉండేవారు.వారిని 'రెడ్ ఇండియన్లు' అంటారు.

అక్కడక్కడా వారి గుడారాలు మాత్రమే కనిపించేవి. ఆ రోజుల్లో జనం ఎక్కడికి పోయినా తమ వెంట ఏదో ఒక ఆయుధం తీసుకుపోయేవారు. బందిపోట్లు మీద పడితే ఎదిరించడానికి, పులుల్లాంటివి పైనబడితే కాపాడుకొనేందుకు అవి పనికొచ్చేవి.

జానీ మామయ్య మాత్రం తన వీపుకి ఒక పెద్ద మూట కట్టుకునేవాడు. ఆ మూట నిండా యాపిల్ గింజలే! పొడవాటి కాడ ఉండే గిన్నెను టోపీలా నెత్తి మీద బోర్లించుకునేవాడు.

అదే అతడి సరంజామా! జానీ మామయ్య తన ప్రయాణంలో దారి పొడుగునా, ప్రతి చోటా యాపిల్ గింజలను విత్తుతూ పోయే వాడు. దారిలో కనిపించే జనం చిన్నచిన్న యాపిల్ గింజల మూటలను అతనికి ఇచ్చేవారు మెల్లమెల్లగా, అందరూ అతడ్ని 'యాపిల్ గింజల జానీ మామయ్య' అని పిలవడం మొదలుపెట్టేసారు. మధ్యలో అప్పుడప్పుడూ జానీ మామయ్య కొన్ని వారాలు ఒకేచోట ఉండి పోయేవాడు.

అక్కడే ఉండి అందరికీ సాయం చేసేవాడు. అందరూ కలిసి ముందుగా నేల చదును చేసి.ఆ తర్వాత కట్టెదుంగలతో ఇళ్లు కట్టేవారు. అంతా అయ్యాక లెక్కలేనన్ని యాపిల్ మొక్కలు నాటేవారు. పనంతా అయిపోయాక జానీ మామయ్య మళ్లీ ప్రయాణం కట్టేవాడు.

మరొకచోట ఇలాగే మరి కొందరికి సాయం చేసేవాడు. అయితే తన పాత మిత్రులను మర్చిపోకుండా వారిని చూసి పోయేందుకు మళ్ళీ మళ్ళీ వెనక్కి వచ్చేవాడు.

జానీ మామయ్య అంటే అందరికీ ఇష్టం. ముఖ్యంగా పిల్లలకి అతనంటే మరీ ఇష్టం. యాపిల్ గింజలను విత్తి విత్తి, అలసట తీర్చుకునేందుకు జానీ మామయ్య ఏ చెట్టు కిందో కూచునేవాడు.

అప్పుడు పిల్లలంతా అతని చుట్టూ మూగేవారు. కథలు, జరిగిన సంగతులూ చెప్పమనేవారు. మామయ్య చెప్పేది మహా ఇష్టంగా వినేవారు.

ఒకచోటి నుంచి మరో చోటికి జానీ మామయ్య ఒంటరిగానే పోయేవాడు. ఏ అడవిలోనో ఏ నది ఒడ్డునో నేలపై పడుకునేవాడు. అప్పుడు ఆకాశమే అతనికి (ఇంటి) పైకప్పు. దారిలో అతనికి ఎలుగుబంట్లు, జింకలు, నక్కలు రకరకాలు పక్షులు ఎదురయ్యేవి.

అన్నీ అతనికి నేస్తాలుగా మారిపోయేవి. అడవుల్లో తిరిగేటప్పుడు జానీకి దారిలో చాలా మంది 'రెడ్ ఇండియన్లు' కలిసేవారు. వారతడ్ని ఎంతో ప్రేమగా చూసేవారు. మామయ్య వారికి రకరకాల గింజలు, మూలికలు ఇచ్చేవాడు.

రెడ్ ఇండియన్లు వాటితో మందులు చేసుకునేవారు. మామూలుగా తెల్లవాళ్లంటే రెడ్ ఇండియన్లకు ఒళ్ళు మంట. రెడ్ ఇండియన్లు మొదటి నుంచి అక్కడే ఉంటుండగా తెల్లవాళ్లు తర్వాత వచ్చారు. రెడ్ ఇండియన్ల భూములను, పొలాలను ఆక్రమించుకున్నారని తెల్లవాళ్లంటే వారికి కోపం. జానీ మామయ్య కూడా తెల్లవాడే అయినా అతనంటే వారికి ఇష్టం. జానీ మామయ్య వారికి ఎంతో ఆప్తుడిలా అనిపించాడు. మనుషులు ఒకరినొకరు కొట్టుకోవటం, తిట్టుకోవటం జానీకి అస్సలు ఇష్టం ఉండదు.

జగడాలు మాని, శాంతంగా ఉండమని తెల్లవారికి రెడ్ ఇండియన్లకు నచ్చచెప్పేవాడు. మనుషులంతా అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉండాలని ప్రేమగా బతకాలని జానీ మామయ్యకు ఎంతో కోరిక అంటూ అతని వ్యక్తిత్వాన్ని పరిచయం చేస్తాడు రచయిత.

ఒకనాడు జానీ మామయ్య ఒక యాపిల్ చెట్ల తోటలో విచారంగా నడుస్తుండుగా అంతలోనే ఉన్నట్టుండి దబ్బున నేలపై పడిపోతాడు. జ్వరంతో ఒళ్లు కాలిపోయి కొన్ని గంటలపాటు మంచు గడ్డల్లో అలాగే పడి ఉండి పోతాడు. ఒక గిరిజన మహిళ ఆమె కొడుకు అటుగా పోతూ జానీని చూసి. సాయం కోసం పరిగెత్తగా గూడెంలోని జనం వచ్చి. జానిని మోసుకుంటూ వూరికి తీసికెళ్తారు. కొద్ది రోజుల తర్వాత జానీ కోలుకుంటాడు.జ్వరం పూర్తిగా తగ్గిపోతుంది. చలికాలం ముగిసి వసంత కాలం వస్తుంది.ఎప్పటిలాగే యాపిల్ గింజలమూట కట్టుకుని మళ్ళీ బయలు దేరతాడు.

యాపిల్ గింజల జానీ మామయ్య ఎన్నో ఏళ్లు బతికాడు. ఎందరెందరికో దారి చూపాడు. అడుగుపెట్టిన ప్రతిచోట యాపిల్ గింజలను విత్తాడు. ఒకటి కాదు రెండు కాదు. లక్షల మొక్కలకు ప్రాణం పోసాడు. జానీ మామయ్య నాటిన చెట్లలో అనేకం ఇప్పటికీ బతికే ఉన్నాయి. వాటి మానులు బాగా ముదురుపట్టాయి.

అయినా అవి పూలతో పళ్ళతో నిండుగా నవ్వుతున్నాయి. చెట్లు పెంచితే ఎంత లాభం! అందరూ చెట్లు నాటాలి అవి పెరిగి పెద్దవై లోకమంతటికీ మేలు చేయాలి !! జానీ మామయ్య మనకు అదే చేసి చూపించాడు. వనజీవి రామయ్య లాంటి వారెందరో జానీ మామయ్య బాటలో పయనించి ధన్యజీవులు అయ్యారు.

# జాతీయం - అంతర్జాతీయం



డి. రాము
రాష్ట్ర అధ్యయన కమిటీ సభ్యులు

## ఫ్రమ్ స్క్రీన్ టు బైండర్

2026 ఆగస్టు నాటికి స్వీడన్ లోని పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ప్రభుత్వం మళ్లీ పాత రోజుల్లో లాగే పుస్తకాలను, పెన్నులను తరగతి గదిలోకి తీసుకొచ్చింది. 2009 నుంచే స్వీడన్ తన విద్యావ్యవస్థను పూర్తిగా డిజిటలైజ్ చేసింది. ప్రతి విద్యార్థికి ఒక ల్యాప్ టాప్ లేదా ట్యాబ్లెట్ ఇస్తారు . అయితే గత పదేళ్ల అనుభవం తర్వాత విద్యానిపుణులకి ఒక చేదు నిజం తెలిసింది.డిజిటల్ డివైస్‌ల అతిగా వినియోగించడం వలన స్టూడెంట్స్ లో చదివే స్కిల్ తగ్గింది. దాంతోపాటు ఏకాగ్రత కూడా బాగా తగ్గిందని రీసెర్చ్‌లో తేలింది.

అందువలన ప్రభుత్వం 120 మిలియన్ లా డాలర్లు ఖర్చు పెట్టి ప్రతి విద్యార్థికి ప్రతి సబ్జెక్టు యొక్క ఫిజికల్ టెక్స్ట్ బుక్స్,పేపర్లు,పెన్ను అందించాలని చర్యలు చేపట్టింది.

2026 ఆగస్టు నుండి స్వీడన్ ప్రభుత్వం విద్యార్థులకు జాతీయస్థాయి మొబైల్ ఫోన్ బ్యాన్ అమల్లోకి తీసుకురాబోతుంది. 2028 నాటికి పూర్తిగా టెక్స్ట్ బుక్స్ మీదే ఆధారపడుతుంది.

డిజిటల్ (స్క్రీన్స్) వల్ల వచ్చే హ్యాపీనెస్ కంటే చేత్తో తాకగలిగే వస్తువులు మనకి ఎక్కువ మానసిక సంతృప్తిని ఇస్తాయి.అంతే కాదు చేతిరాత రాయడం వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుంది. పేపర్ మీద చదవడం వల్ల విషయం బాగా గుర్తుంటుంది. ఇది కేవలం పాత కాలానికి వెళ్లడం కాదు టెక్నాలజీ వల్ల కోల్పోయిన స్పర్శ జ్ఞానాన్ని మళ్లీ పొందడమే అంటున్నారు.

అత్యున్నత సాంకేతికత అవసరమే కానీ అది మన మూలాలను దెబ్బతీయకూడదు.

టెక్నాలజీ వద్దని కాదు,అది ఎంతవరకు ఉండాలి?అనేది అసలు ప్రశ్న. గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన విద్యను అందించడానికి కొన్ని అంశాలను సులభముగా అర్థమయ్యేలా వివరించడానికి యానిమేషన్ అంటే డిజిటల్ ఎడ్యుకేషన్ అవసరము.అయితే చిన్న పిల్లలకు మొదటి దశలోనే స్క్రీన్లు అలవాటు చేస్తే వాళ్లలో ఆలోచన శక్తి తగ్గిపోయే ప్రమాదం ఉంది. స్వీడన్ వంటి దేశాలు ఇప్పుడు ఏమంటున్నాయి అంటే కోడింగ్ నేర్పండి కానీ అది పుస్తకం చదవడం నేర్చుకున్న తర్వాతే. కాబట్టి డిజిటల్ విద్య అనేది ఒక సాధనం లాగా ఉండాలి తప్ప అది గురువు స్థానాన్ని భర్తీ చేయకూడదు.

అభివృద్ధి అంటే కేవలం టెక్నాలజీని పెంచుకుంటూ పోవడం మాత్రమే కాదు మానసిక ప్రశాంతత, ప్రాథమిక నైపుణ్యాలను కాపాడుకోవడం కూడా అని స్వీడన్ నిరూపిస్తోంది. ముఖ్యముగా చిన్నపిల్లలకు చేతిరాత, పుస్తక పఠనం ఎంత అవసరమో ప్రపంచానికి చాటి చెప్తుంది.

## బ్యాలెన్స్ తప్పుతున్న బాలేంద్ర షా

నేపాల్ ప్రధానిగా బాలేందర్ షా నేతృత్వం లోని కొత్త ప్రభుత్వం విద్యారంగంలో కొన్ని మార్పులు ప్రవేశపెట్టింది.

5వ తరగతి వరకు సాంప్రదాయక రాత పరీక్షలను రద్దు చేశారు. (పరీక్షలే లేని బాల్యం) విద్యార్థుల ప్రగతిని అంచనా వేయడానికి ప్రత్యామ్నాయ మూల్యాంకన విధానాలను (ప్రాజెక్టులు, అభివృద్ధి రిపోర్టులు మొదలైనవి) అమలు చేయనున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలని కొత్త నియమం ప్రవేశ పెట్టారు. అయితే ప్రభుత్వంలో ఉన్న అందరి పిల్లలు ప్రభుత్వ బడిలో చేరేటట్లు చట్టం తెస్తే బాగుంటుందని అభిప్రాయం ప్రజలలో ఉంది.

ఇప్పటికే చదువుతున్న విద్యార్థుల నుంచి పున:ప్రవేశ రుసుములను పలుమార్లు వసూలు చేయడానికి నిరోధిం చారు. పత్రాల కొరత వల్ల చదువు ఆటంకం కాకూడదు అని పేర్కొంటూ పౌరసత్వ ధ్రువీకరణ వంటి అంతరాయాలను తగ్గించే చర్యలు కూడా ప్రవేశపెట్టారు.

విద్యాసంస్థలకు ఉన్న విదేశీ పేర్లను నేపాలీ పేర్లుగా మార్పు చేసుకోవాలి.

ఆక్స్ ఫర్డ్, పెంటగాన్ సెయింట్ జేవియర్స్ వంటి విదేశీ పేర్లతో ఉన్న పాఠశాలలు, కాలేజీలు తమ పేర్లను నేపాలీ పేర్లుగా మార్చుకోవాలని ఆదేశించారు. ఇది స్థానిక సంస్కృతి, భాషా ప్రాధాన్యత పెంచడం కోసం చేసిన చర్యగా పేర్కొన్నారు.

ఇంతవరకు కొంత బాగున్నా...

## విద్యార్థుల హక్కులపై దాడి :

పాఠశాలలు, కాలేజీల ప్రాంగణాలలో రాజకీయ పార్టీలతో అనుబంధం ఉన్న విద్యార్థి సంఘాలను పూర్తిగా నిషేధించారు. విద్యార్థి మండలిలు సమస్యలను పరిష్కరిస్తాయని చెప్తున్నారు. విద్యార్థుల, యువత మద్దతుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం సంఘాలను నిషేధించడం పట్ల విద్యార్థి సంఘాలు,మానవ హక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సంఘాల నిషేధము అంటే హక్కులను హరించడమే, ప్రశ్నించే సామర్థ్యాన్ని నీరుగార్చడమేనని విమర్శిస్తున్నారు. విద్యార్థులు చైతన్య వంతంగా, క్రియాశీలకంగా రాజకీయాలలో ఉంటే ఏం జరుగుతుందో బాలేంద్ర షాకు బాగా తెలుసు. కాబట్టే విద్యార్థి సంఘాలను నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారని, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఏకోపాధ్యాయ పాఠశాలలు... ఏపీ లోనే ఎక్కువ

ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలలో ఆంధ్ర ప్రదేశ్ మొదటి స్థానంలో ఉన్నది. దేశవ్యాప్తంగా 1,04,125 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండగా వీటిలో 33.76 లక్షలమంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కేంద్ర విద్యా శాఖ గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా 12,912 ఉండగా, తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్ 9,508. ఝార్ఖండ్ 9,172, మహారాష్ట్ర 8,152, కర్ణాటక 7,349, లక్షద్వీప్ 7,217, మధ్యప్రదేశ్ 7,217, పశ్చిమబెంగాల్ 6,482, రాజస్థాన్ 6,117, ఛత్తీస్‌ఘడ్ 5,973, తెలంగాణ 5,001 ఉన్నాయి. దేశవ్యాప్తంగా పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థుల నిష్పత్తి 1:34గా ఉంది. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం 1-5 తరగతుల వరకు 1:30గా ఉండాలి. 6-8 తరగతులు వరకు 1:35గా ఉండాలి. సింగల్ టీచర్ స్కూలులలో విద్యార్థుల చేరికల పరంగా ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది.



# ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయి మెంట్ ఆర్డర్-2025

## (ఉద్యోగుల లోకల్ కేడర్ ఆర్గనైజేషన్ ఉత్తర్వులు)



కె.ఎస్.ఎస్.ప్రసాద్
యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా గుర్తిస్తూ రాజ్యాంగ సవరణకు పార్లమెంట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో జిల్లాల పునర్విభజన, ఉద్యోగ నియామకాలకు సంబంధించిన ప్రక్రియ వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో లోకల్ క్యాడర్ ఆర్గనైజేషన్ మరియు డైరక్టు రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయి మెంట్ ఆర్డర్-2025" జిఓ ఎంఎస్ నం.45, తేదీ.20.04.2026న విడుదల చేసింది.

2022లో 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజిస్తూ చేసిన పున:వ్యవస్థీకరణను ఆమోదిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన నేపథ్యంలో ఈ ఉత్తర్వులు రూపొందించబడ్డాయి. దీని ప్రకారం 26 జిల్లాలు, ఆరు జోన్లు, రెండు మల్టీపుల్ జోన్లు అమలులోకి రానున్నాయి.

ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులను, ఉద్యోగులను వారి స్థానికత ఆధారంగా జిల్లాలకు కేటాయించడంతోబాటు భవిష్యత్‌లో చేపట్టబోయే నియామకాలు, ప్రమోషన్లు, బదిలీలకు ఈ ఉత్తర్వులనే ప్రామాణికంగా తీసుకోబోతున్నారు.

**లోకల్ క్యాడర్ ఆర్గనైజేషన్ :**

రాష్ట్రంలోని వివిధ డిపార్టుమెంట్‌లలోని పోస్టులను ఉత్తర్వులు వెలువడిన 27 నెలలలోపు లోకల్ క్యాడర్లుగా ఆర్గనైజ్ చేయవలసి ఉంది. దీని నిమిత్తం మొత్తం పోస్టులను (1) జిల్లాస్థాయి (2) జోనల్ స్థాయి (3) మల్టీ జోనల్ స్థాయి కేటగిరీలుగా విభజించారు.

**1) జిల్లా స్థాయి:** ఒక జిల్లాలో జూనియర్ అసిస్టెంట్, తత్సమాన లేదా అంతకంటే తక్కువ స్థాయి కలిగిన పోస్టులను జిల్లా క్యాడర్‌గా పరిగణిస్తారు. అట్లే ఏపి స్కూలు ఎడ్యుకేషన్ సబార్డినేట్ సర్వీసు రూల్సులో పేర్కొన్న పోస్టులు కూడా జిల్లా క్యాడర్‌గానే పరిగణించ బడతాయి.

**2) జోనల్ స్థాయి :** జూనియర్ అసిస్టెంట్‌కంటే పైస్థాయి నుండి సూపరింటెండెంట్ స్థాయి వరకు మరియు ఫస్ట్ లెవెల్ గజిటెడ్ ఆఫీసరు పోస్టులు జోనల్ క్యాడరుగా పరిగణించబడతాయి.

**3) మల్టీ జోనల్ స్థాయి :** సూపరింటెండెంట్ పైస్థాయి నుండి డిప్యూటీ కలక్టరు స్థాయి వరకు ఉన్న పోస్టులన్నీ మల్టీ జోనల్ క్యాడర్‌గా పరిగణించబడతాయి.

విద్యారంగానికి సంబంధించి స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు, లాంగ్వేజి పండితులు, పియిటిలు, తత్సమాన కేటగిరీల ఉపాధ్యాయులు జిల్లా క్యాడర్‌గాను; హెడ్ మాస్టర్ గ్రేడ్-1,2, ఎంఇఓ, డిప్యుటీ ఇఓ తత్సమాన క్యాడర్లు జోనల్ క్యాడర్‌గాను; డియిఓ, ఆర్‌జెడి తత్సమాన పోస్టులు మల్టీ జోనల్ పోస్టులుగాను పరిగణించ బడతాయి.

**ఉద్యోగుల కేటాయింపు :**

జిల్లాలవారీగా పోస్టుల విభజన తర్వాత..

1. పరిపాలనా అవసరాల దృష్ట్యా
2. వయసు, సీనియార్టీ గ్రూపులను బ్యాలన్ చేసే విధంగా
3. సర్వీసు కాలం ఆధారంగా
4. సాధ్యమైనప్పుడు వారి ప్రిఫరెన్సు

- బట్టి జిల్లాలకు ఉద్యోగులను కేటాయిస్తారు.

వివిధ డిపార్టుమెంట్లు, కేటగిరీ పోస్టులలో ఉద్యోగుల కేటాయింపుకు సంబంధించి ప్రభుత్వం డిపార్టుమెంట్ వారీ కమిటీలు ఏర్పాటు చేస్తుంది.

పోస్టుల కేటాయింపులో ఏదైనా అసంతృప్తి ఉంటే సంబంధిత ఉద్యోగి వ్రాతపూర్వకమైన రిప్రజంటేషన్ కమిటీకి ఉత్తర్వులు జారీ చేసిన 60 రోజులలోపు సమర్పించాలి. కమిటీ వారి రిప్రజంటేషన్ పరిశీలించి తుది ఉత్తర్వులు ఇస్తుంది. అయితే ఆ తుది ఉత్తర్వులు వేరేవారు ఎవరూ మరల ఫిర్యాదు చేయకుండా, ఆర్టికల్ 371 (డి)కి లోబడి ఉండాలి.

**లోకల్ ఏరియా..**

(1) ఒక జిల్లాలో జూనియర్ అసిస్టెంట్, దానికి తత్సమానమైన లేదా అంతకంటే తక్కువ పోస్టుల నియామకానికి సంబంధిత జిల్లాను లోకల్ ఏరియాగా పరిగణిస్తారు.

(2) ఒక జోన్‌లో జూనియర్ అసిస్టెంట్ పైస్థాయి నుండి సూపరింటెండెంట్ మరియు ఫస్ట్ లెవల్ గెజిటెడ్ ఆఫీసర్, తత్సమాన పోస్టులలో నియామకాలకు ఆ జోన్‌లోని జిల్లాలను లోకల్ ఏరియాగా పరిగణిస్తారు.

(3) ఒక మల్టీ జోన్‌లో సూపరింటెండెంట్ పైస్థాయి నుండి డిప్యూటీ కలక్టర్, తత్సమాన పోస్టుల నియామకాలకు ఆ మల్టీ జోన్‌లోని జిల్లాలను లోకల్ ఏరియా పరిగణిస్తారు.

### అభ్యర్థి స్థానికత నిర్ధారణ ఎలా?

ఉద్యోగ నియామకాలకు సంబంధించి అభ్యర్థి చదువు, నివాసం ప్రాతిపదికన అతని స్థానికత నిర్ధారిస్తారు.

(1) పోస్టు నియామకానికి సంబంధించి కనీసం విద్యార్హతలు పేర్కొన్న సందర్భంలో 7వ తరగతి పరీక్ష మొదటిసారి హాజరైన నాటి ముందు 4 సం॥లు ఎక్కడ చదివారో, దానిని బట్టి అభ్యర్థి స్థానికత నిర్ణయించబడుతుంది.

- అంటే 4,5,6,7 తరగతులు ఆంధ్రప్రదేశ్‌లో చదివిన వారు ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాలకు స్థానిక అభ్యర్థులు అవుతారు.
- అట్లే 4,5,6,7 తరగతులు ఏ జిల్లాలో చదివారో ఆ జిల్లా, అభ్యర్థి యొక్క స్థానిక జిల్లా అవుతుంది.
- ఒకవేళ 4,5,6 తరగతులు ఏ పాఠశాలలోనూ చదవనట్లయితే ఆ కాలానికి ఎంఆర్ఓ ఇచ్చిన రెసిడెన్స్ సర్టిఫికెట్ అధారంగా స్థానికత నిర్ణయించబడుతుంది. (ఉదా॥ డైరక్టు 6th Admission)

(2) పోస్టు నియామకానికి సంబంధించి ఎటువంటి విద్యార్హతలు పేర్కొనకపోతే, పోస్టు నోటిఫికేషన్ జారీ చేసిన నాటికి ముందు 4 సం॥లు ఏ ప్రాంతంలో నివసిస్తారో దాని రెసిడెన్సీ సర్టిఫికెట్ ఆధారంగా అభ్యర్థి స్థానికత నిర్ణయించబడుతుంది.

(3) ఒకవేళ అభ్యర్థి 4,5,6,7 తరగతులు ఒకే జిల్లాలో చదవక, వేరు వేరు జిల్లాలలో చదివితే ఆ అభ్యర్థి 1 నుండి 7 తరగతులు ఎక్కువ కాలం చదివిన ప్రాంతాన్ని బట్టి అతని స్థానికత నిర్ధారించబడుతుంది.

ఒకవేళ రెండు జిల్లాలలో సమాన కాలం చదివితే, చివరి జిల్లాను అతని స్థానిక జిల్లాగా పరిగణించబడుతుంది.

ఉదా:కు (1) ఒక విద్యార్థి 1 నుండి 3 తరగతులు ఒక జిల్లాలో, 4 నుండి 7 తరగతులు రెండవ జిల్లాలో చదివితే - రెండవ జిల్లాను ఆ అభ్యర్థి యొక్క స్థానిక జిల్లాగా పరిగణిస్తారు.

(2) ఒక విద్యార్థి 1-3 తరగతులు ఒక జిల్లాలో, 4-6 తరగతులు 2వ జిల్లాలో, 7వ తరగతి 3వ జిల్లాలో చదివారనకుందాం. ఇలాంటి సందర్భంలో 4-6 తరగతులు చదివిన జిల్లాకు స్థానికత అభ్యర్థిగా పరిగణిస్తారు.

(3) ఒక అభ్యర్థి 1,2 తరగతులు అన్నమయ్య; 3-4 తరగతులు చిత్తూరు, 5-6 తరగతులు తిరుపతి, 7వ తరగతి వేరొక జిల్లాలో చదివారు అనుకుందాం. ఇలాంటి సందర్భంలో 5-6 తరగతులు చదివిన తిరుపతి జిల్లాను అభ్యర్థి యొక్క స్థానిక జిల్లాగా పరిగణిస్తారు.

(4) 1-2 తరగతులు చిత్తూరు, 3-4 తరగతులు తిరుపతి, 5-6 తరగతులు అన్నమయ్య, 7వ తరగతి తిరుపతి చదివారు. అంటే ఎక్కువ కాలం అనగా తిరుపతిలో 3 సం॥లు చదివారు కాబట్టి తిరుపతి జిల్లాను అభ్యర్థి యొక్క స్థానిక జిల్లాగా పరిగణిస్తారు.

(4) దివ్యాంగులకు సంబంధించి గుడ్డి, మూగ, చెవిటి వైకల్యం కలిగిన వారు స్పెషల్ స్కూల్సులో చదివినపుడు తలిదండ్రుల స్థానికత ఆధారంగా వారి స్థానికత నిర్ధారిస్తారు.

(5) ఏదైనా ప్రభుత్వోద్యోగి వృత్తిరీత్యా ఇతర రాష్ట్రాలలో పనిచేయవలసి వచ్చినపుడు, అతని పిల్లలు ఇతర రాష్ట్రాలలో చదివితే ఆ పిల్లవాడు తల్లి లేదా తండ్రి స్థానికతను తమ స్థానికతగా ఎంచుకోవచ్చు.

### ప్రత్యక్ష నియామకాల్లో రిజర్వేషన్లు :

- జిల్లా, జోనల్, మల్టీ జోనల్ ఏ స్థాయిలో అయినా పోస్టులలో 95% పోస్టులు స్థానికులకే కేటాయించబడతాయి.
- ఒక జిల్లాలోని జూనియర్ అసిస్టెంట్, తత్సమాన మరియు క్రిందిస్థాయి పోస్టులలో 95% సంబంధిత జిల్లా అభ్యర్థులకు మాత్రమే కేటాయించడం జరుగుతుంది. అట్లే జోనల్ పోస్టులలో 95% సంబంధిత జోన్‌లోని అభ్యర్థులకు మాత్రమే కేటాయించడం జరుగుతుంది. మల్టీజోన్ పోస్టులలో 95% సంబంధిత మల్టీ జోన్‌లోని అభ్యర్థులకు మాత్రమే కేటాయించడం జరుగుతుంది.
- కేవలం 5% పోస్టులు మాత్రమే స్థానికేతరులకు కేటాయిస్తారు. ఇవి కూడా మెరిట్ లిస్టులో మొదటి 5% అభ్యర్థులుగా ఉంటే మాత్రమే స్థానికేతరులకు కేటాయించడం జరుగుతుంది.
- పోస్టులను స్థానిక అభ్యర్థులకు రిజర్వు చేసే సందర్భంలో ఫ్రాక్షన్ వస్తే దానిని ఒకటిగా పరిగణిస్తారు. ఉదా:కు 7.2 పోస్టులు రిజర్వు చేయవలసి వస్తే 8 పోస్టుల రిజర్వు చేస్తారు.
- మొత్తం పోస్టులలో కనీసం ఒక్క పోస్టు అయినా స్థానికేత రులకు కేటాయించాలి.
- అదే విధంగా అభ్యర్థులను కేటాయించేటప్పుడు కనీసం ఒక అభ్యర్థినైనా అతని లోకల్ ఏరియా కేటాయించాలి.
- జోనల్ / మల్టీ జోనల్ క్యాడర్లలో జనాభా నిష్పత్తి ఆధారంగా 95% పోస్టులు అభ్యర్థులకు వారి స్థానిక ఏరియాలో కేటాయించాలి.

### క్యారీ ఫార్వర్డ్

ఒక లోకల్ ఏరియాకు సంబంధించిన పోస్టులలో నియామకాలకు తగిన అభ్యర్థులు లభించనప్పుడు అభ్యర్థి లభించేవరకు సదరు పోస్టును 3 సం॥లకు మించకుండా క్యారీ ఫార్వర్డ్ చేయడం జరుగుతుంది. అయితే లోకల్ అభ్యర్థి లభించేవరకు ఇతర లోకల్ ఏరియాలోని అదే కేటగిరీకి సంబంధించిన అభ్యర్థితో తాత్కాలికంగా భర్తీ చేయవచ్చు.

### పై ఉత్తర్వులలోని నిబంధనలు ఈక్రింది పోస్టులకు వర్తించవు:

(1) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలోని సెక్రటేరియేట్ పోస్టులు
(2) హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ ఆఫీస్‌లోని పోస్టులు
(3) ప్రత్యేకమైన ఆఫీస్ లేదా ఎస్టాబ్లిష్‌మెంట్ పోస్టులు
(4) స్టేట్ లెవల్ ఆఫీసులు, సంస్థలలోని పోస్టులు
(5) రాజధాని ప్రాంతపు పోలీస్ కమీషనరేట్‌లోని పోస్టులు

### ముగింపు :

పై ఉత్తర్వుల అమలుకు సంబంధించి ఉద్యోగుల కేటాయింపుకు డిపార్ట్‌మెంట్ వారీగా కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు త్వరలో ఇవ్వబడతాయి. అదే విధంగా ఉద్యోగుల నుండి ఆప్షన్ కోరబడుతుంది. ఈ ఉత్తర్వులు 26 జిల్లాలకు మాత్రమే వర్తిస్తాయి. కొత్తగా ఏర్పడిన 2 రెండు జిల్లాలకు కూడా రాష్ట్రపతి ఆమోదం తెలిపిన తర్వాతనే 28 జిల్లాలకు వర్తింపజేస్తారు. ఈ ఉత్తర్వుల అమలులో ఎదురయ్యే సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుంది.



# పోరాటాల ద్వారానే గిరిజనుల హక్కులు సాధ్యం

పోరాటాల ద్వారానే గిరిజన హక్కులు సాధించబడతాయి, రక్షించ బడతాయి. కాబట్టి గిరిజన హక్కులు పరిరక్షించడానికి ఉపాధ్యాయులు, మేధావులు పోరాటాలకు సిద్ధం కావాలని మాజీ పార్లమెంట్ సభ్యులు డా॥ మిడియం బాబురావు పిలుపునిచ్చారు.

2026 ఏప్రిల్ 12న రంపచోడవరంలో జరిగిన ట్రైబల్ వెల్ఫేర్ టీచర్ల 6వ రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డా॥ బాబురావు 'గిరిజన చట్టాలు–వాటి అమలు' అంశంపై మాట్లాడుతూ...

ప్రస్తుత పాలకులు గిరిజన ప్రాంతంలో ఉండే గిరిజనుల రక్షణ చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. జీవో నం.3ని రద్దుచేసి గిరిజన యువతకు ద్రోహం చేశారని అలాగే 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు గిరిజన భూములను దోచి పెట్టాలని చూస్తున్నారని అన్నారు.

భారతదేశంలో సంస్కృతికి మూలం గిరిజనులు చరిత్ర గతాన్ని మార్చి ఆదివాసుల్ని వనవాసులుగా పిలుస్తున్నారు మనం తెగల క్రమంలో ఉన్నాం. ఇది చాలా కీలకమైనది మనది కోపరేటివ్ కల్చర్ మన నుంచి ప్రపంచం నేర్చుకోవాలి పోలవరం ప్రాజెక్టు వలన 1,60,000 మంది గిరిజనులు నిర్వాసితులు కాబడ్డారు. గిరిజను లందరూ గోదావరిలో కలిసిపోతే పాఠశాలలు ఉండవు పాఠశాల లేకపోతే ఉపాధి అవకాశాలు ఉండవు కాబట్టి వారిని చైతన్యం చేసి ఈ ప్రాంతాన్ని కాపాడా కాపాడడంలో మనం ముందుండాలి. ఎక్కువ టూరిజం పేరుతో కార్పొరేట్లకు అప్పజప్పున్నారు.

అటవీ హక్కుల చట్టంలో మార్పులు చేశారు ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం చేస్తున్నారు విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు మునుపు 25వేలమంది ఉద్యోగుల్లో 4500 మంది గిరిజనలు ఉండేవారు ప్రస్తుతం వారందరినీ నోరు లేదని విఆర్ఎస్ పేరుతో తీసేశారు ఇప్పుడు 1250 మందికి తగ్గించారు గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నాం నేషనల్ హైవేలను తీసుకువచ్చాం అని చెప్తున్న ఈ పాలకులు ప్రకృతి సంపదను దోచుకోవడానికి సిద్ధపడుతున్నారు. గంజాయి అక్రమ రవాణా చేసిన వారిని విడిచిపెట్టి గంజాయివాడు అని అమాయక గిరిజన పిల్లలను 1200మందిని జైల్లో నిర్బంధించారు. ఈ ప్రాంతంలో ఎవేర్నెస్ చేయకుండా గిరిజన ప్రాంతం ప్రశాంతంగా ఉండదు. పాలకవర్గాలు మన మనిషిని పెట్టి మనల్ని భ్రమల్లో ముంచి మన చట్టాలను సర్వనాశనం చేస్తున్నారు పాలకులు.

భారతదేశంలో సాంస్కృతిక మూలాలు ఆదిమ సమాజం ప్రకృతి సహజ సిద్ధంగా ప్రకృతిని ఆరాధించడం ఆట మాట పాట మొదలైనవి శ్రమ నుండి పుట్టినవి ప్రభుత్వ విధానాల వలన సంస్కృతి నాశనం కాబడుతుంది. చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారు. పాలకవర్గాలకు ఉపయోగపడే అంశాలను అమలు చేస్తున్నారు జీవో నెంబర్ 3 రద్దు చేయడం 10 యాక్ట్ తూట్లు పొడవడం హైడ్రాలిక్ ప్రాజెక్టు తీసుకు రావడం పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించక పోవడం, 5,6 షెడ్యూల్ అంశాలను అమలు చేయకపోవడం, సబ్ ప్లాన్ నిధులను మంజూరు చేయకపోవడం, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయకపోవడం, ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం చేసి సామాజిక న్యాయంపై దెబ్బ కొట్టడం, సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడం, పండగలు వేషధారణలో మార్పులు తీసుకురావడం జరుగుతున్న నేపథ్యంలో భావజాల రంగంలో ఆధిపత్యం తీసుకు రావడంలో భాగంగా ప్రత్యేకంగా సాంస్కృతిక రంగాన్ని పరిరక్షించు కోవడానికి ఫెస్టివల్ నిర్వహించడం గిరిజనుల నిజమైన వారసులు మేమే అని తెలియజేయడం ప్రధానమైనదని అన్నారు.

తెగల మధ్య ఘర్షణ పెట్టి సోషల్ ఇంజనీరింగ్ ఉపయోగించు కుని మతోన్మాద శక్తులు బలపడుతున్నారని దీన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత గిరిజనులు, మేధావులు మీద ఉందని కులస్తిత్వాలు ఉన్నంతకాలం కుల నిర్మూల జరిగే దానికి అవకాశం లేదు రాజ్యాంగాన్ని పరిరక్షించిన నాడే మన హక్కులు రక్షించబడతాయి మనందరం ఐక్యంగా ఉండి పోరాట వారసత్వాన్ని ముందుకు తీసుకుని వెళ్లి భవిష్యత్తు పోరాటాలకి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలోని అన్ని ఐటిడిఏల నుండి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులు సుమారుగా 600 మంది పాల్గొన్నారు. సదస్సుకు పోలవరం జిల్లా శాఖ అతిథ్యమిచ్చింది.

# అసంఘటిత ఉపాధ్యాయులు

నాలుగు గోడల మధ్య సమాజ నిర్మాణకులు
అలుపెరగని గొప్ప శ్రామికులు
గుర్తింపు ఆశించని చక్కని బోధకులు
ఉద్యోగ భద్రత లేని ఉద్యోగస్తులు
పూట గడవని ధనవంతులు
అకుంఠిత దీక్ష గల్గిన పనిమంతులు
తరగతి గదిలో తప్పవు వీరికి పదనిసలు
బ్రతుకు దెరువు కోసం వీరు బానిసలు
లీటర్ల కొద్దీ రక్తం ఖర్చయినా
గుండెల్లో దాగి వున్న బాధలెన్నయినా
ఎవరికీ చెప్పుకోలేరు; చెప్పినా ఎవరు తీర్చగలరు?
విలువ లేనివారు, కొలువు చేస్తున్నారు.
ఇంటివారి కనీస అవసరాలు తీర్చలేరు
కొంపకు అద్దె గడువు లోగా కట్టలేరు
పెరిగి పోయే ఖర్చులను దారికి తేలేరు
ఈ వృత్తిలో నాలుగు రాళ్ళు వెనుక వేయలేరు
రోగమొచ్చిందంటే పలకరించే నాధుడే లేడు
పనిలో తేడా వస్తే తిట్ల దండకం మొయ్యాలి వీడు
ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం వుండదు
పని చేసే స్థలంలో నిరుత్సాహం వీడదు
నోరున్న మాట్లాడలేని మూగవారు
అన్యాయం ఎదురైనా ప్రశ్నించ లేని పనివారు
క్రమశిక్షణ విద్యార్థులకు నేర్పుతారు
క్రమం తప్పిన జీవితాలను బాగు చేస్తారు
అడ్మిషన్లు అడుక్కునే రోడ్ల వెంబడి యాచకులా వీరు?
సారమంతా విద్యార్థుల కొరకై కోల్పోతున్న జీవాలు వీరు
ఏ దిక్కు నుండి అందుతాయి వీరికి పరిహారాలు?
అవసరం లేకుంటే పక్కన పడేసే విస్తరాకులు వీరు
ఏ రంగంలో చూసిన వీరి విద్యార్థులే
పునాది లేకుంటే భవనం ఎక్కడ?
ఉపాధ్యాయులు లేకుంటే సమాజ మెక్కడ?
వీరిని మనుష్యులుగా గుర్తించే వ్యవస్థ లెక్కడ?
కృతజ్ఞత గల్గిన వీరి విద్యార్థు లెక్కడ?
పదవ తరగతి ఫలితాలే ప్రమాణికం?
అడుగడుగునా కనిపించే వీరి పేదరికం!!
మే నెల జీతం వీరికి అప్రమాణికం?
వీరి జీవితం గుర్తింపు లేని సమాజ సార్థకం.
పాడిస్తారు తరగతిలో వందేమాతరం
వెదజల్లుతారు విద్యార్థుల హృదయాలలో మంచి సారం
వీరి జీవితం అగమ్యగోచరం
ఆలోచించునా వీరి గురించి నేటి ఈ తరం....
బంగారం కొనలేరు వీరు
బంగారు భవిష్యత్తు ఇవ్వగలరు
ఎన్నిక లేనివారు వీరు
ఏలికలను తయారు చేయగలరు.
వీరు నేర్పిస్తారు విద్యార్థులకు మంచి సంస్కారం
చూపిస్తారు తమ బిడ్డల వలె అందరిపై మమకారం
అందిస్తారు ప్రతి సమస్యకు మంచి పరిష్కారం
వీరికి అందునా న్యాయమైన పరిహారం?
నల్లని బోర్డుపై రాసే తెల్లని గీతలు
మార్చారు ఎందరో విద్యార్థుల తలరాతలు
నింపారు ఎంతోమంది జీవితాలలో వెలుగు రేఖలు
వెలుగు నిచ్చి కరిగిపోయే కొవ్వొత్తులు
వీరిని కూడా నిందించే లోకులు, పలు కాకులు.

– బంకా నాగరాజు

## లంచ్ బాక్స్‌లో రొట్టె పంచదార తెచ్చుకున్న బాలుడు..

## టీచర్ చేసిన పనికి ప్రపంచమే సలాం చేస్తోంది!



పాఠశాల అనేది కేవలం చదువు నేర్పే చోటు మాత్రమే కాదు.. అది పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే వేదిక కూడా అని ఈ వైరల్ వీడియో నిరూపించింది. ఒక చిన్నారి లంచ్‌బాక్స్ విషయంలో జరిగిన ఈ సంఘటన అందరి హృదయాలను హత్తుకుంటోంది.

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక రీల్‌లో ఒక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులందరూ కలిసి భోజనం చేస్తున్నారు. అందరూ రకరకాల కూరలు, పప్పులు తెచ్చుకోగా, ఒక పేద విద్యార్థి మాత్రం తన బాక్స్‌లో కేవలం రొట్టె, పంచదార మాత్రమే తెచ్చుకున్నాడు. తన స్నేహితుల ముందు ఆ ఆహారాన్ని తీయడానికి ఆ బాలుడు సంకోచిస్తూ, తల దించుకుని కూర్చున్నాడు. ఆ చిన్నారి తన బాక్స్ చూసి కొంత ఇబ్బందిగా, తక్కువగా ఫీల్ అవుతున్నట్టుగా కనిపించింది.

ఆ చిన్నారి ముఖంలోని బాధను, ఆత్మన్యూనతను గమనించిన ఉపాధ్యాయురాలు, నిశ్శబ్దంగా తన దగ్గరకు వెళ్లారు. ఆమె ఆ బాలుడిని మందలించడమో లేదా జాలి చూపడమో చేయకుండా, అరె.. రొట్టె-పంచదార తెచ్చుకున్నావా? నాకు ఇది అంటే చాలా ఇష్టం! మనం ఇద్దరం కలిసి తిందామా? అని అడిగారు. ఆమె తన దగ్గర ఉన్న కూరలను ఆ బాలుడికి ఇచ్చి, అతని దగ్గర ఉన్న రొట్టెను ఆమె తిన్నారు.

ఆ చిన్నారితో ఎంతో ప్రేమగా మాట్లాడారు. ఆ బాక్స్‌లో ఉన్నది సాధారణ ఆహారం కాదని, అది చాలా రుచికరమైనదని (Classic combination) పాపతో చెప్పారు. చాలా మంది దీనిని ఇష్టంగా తింటారు అని ఆమెను ఉత్సాహపరిచారు. టీచర్ మాటలతో ఆ చిన్నారి ముఖంలో చిరునవ్వు విరిసింది. ఒక వ్యక్తి ఇబ్బందిలో ఉన్నప్పుడు మాటలతో కాకుండా చేతలతో ఎలా ధైర్యం చెప్పాలో ఆమె నిరూపించారు.

ఈ చిన్న సంఘటన ద్వారా ఆ ఉపాధ్యాయురాలు సమాజానికి రెండు ముఖ్యమైన విషయాలను తెలియజేశారు. ఒకటి ఆహారాన్ని గౌరవించడం. ఇంట్లో ఏది ఉంటే అది తెచ్చుకున్న పాపను ప్రోత్సహించడం ద్వారా ఆహారం విలువను చాటిచెప్పారు. మరొకటి పిల్లల్లో సామాజిక స్పృహను కలిగించటం. ఆర్థిక వ్యత్యాసాల వల్ల పిల్లల మనసు గాయపడకుండా చూడటం ఎంత ముఖ్యమో ఆమె నిరూపించారు.

ఈ వీడియో చూసిన లక్షలాది మంది నెటిజన్లు సదరు ఉపా ధ్యాయురాలిపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. నిజమైన విద్య అంటే అక్షరాలు నేర్పడం మాత్రమే కాదు, ఇతరుల పట్ల దయగా ఉండటం నేర్పడం అని కామెంట్స్ చేస్తున్నారు. ప్రతి స్కూల్లోనూ ఇలాంటి టీచర్లు ఉండాలి, చిన్నారి ఆత్మగౌరవాన్ని కాపాడారు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఒక చిన్న ప్రోత్సాహం ఒకరి జీవితంలో ఎంతటి సానుకూల మార్పును తెస్తుందో చెప్పడానికి ఈ సంఘటన ఒక నిదర్శనం. భౌతికమైన వస్తువుల కంటే మానవత్వం, ప్రేమ గొప్పవని ఈ టీచర్ చాటిచెప్పారు.



# స్ఫూర్తినిచ్చిన గిరిజన సంక్షేమ టీచర్ల రాష్ట్ర సదస్సు

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల 6వ రాష్ట్ర సదస్సు 2026 ఏప్రిల్ 12వ తేదీన పోలవరం జిల్లా రంపచోడవరంలో ఘనంగా నిర్వహించబడింది. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, వృత్తిపరంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి తగు కార్యాచరణ రూపొందించే విధంగా సదస్సు నిర్వహించబడింది.

సదస్సుకు అధ్యక్షత వహించిన యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం పోరాడే వాళ్లను శత్రువులుగానూ, గిరిజన హక్కులను కాలరాసే వాళ్లను మిత్రులుగానూ చూసేవాళ్లను గిరిజన ప్రాంత ప్రజలు, మేధావులు దూరం పెట్టాలని పిలుపునిచ్చారు. విద్యారంగంలో ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు ప్రధానంగా విద్యార్థుల సమస్యలు పరిష్కారంలో మెనూ చార్జీలు పెంపుదలలో, కుక్ మరియు కమాటీల నియామకం, పాఠశాలల మౌలిక సదుపాయాల కల్పనకు యుటిఎఫ్ ఎనలేని కృషి చేసిందని తెలిపారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం యుటిఎఫ్ చేసే పోరాటాల్లో మమేకం కావాలని పిలుపునిచ్చారు.

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి మాట్లాడుతూ గిరిజన ప్రాంత ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో పిడిఎఫ్ పక్షాన శాసన మండలి లోపల వెలుపల మంత్రులకు ఉన్నతాధికారులకు పలు ప్రాతినిధ్యాలు చేయడంలో ప్రత్యేకమైన పాత్ర పోషించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా గురుకుల ఉపాధ్యాయుల జీతాలు, డెప్యుటేషన్ల రద్దు, పండిట్, పిఇటి పోస్టుల అప్‌గ్రేడేషన్ సమస్యల పరిష్కారానికి తాను చేసిన కృషిని వివరించారు.

కామ్రేడ్ ఐ. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాడు అటవీ రక్షణ చట్టాలు చేస్తే, నేడు అటవీభక్షణ చట్టాలు చేస్తున్నారు. బ్రిటీష్ వారు వచ్చేవరకు అడవి ఆదివాసులు చేతిలో ఉంది. 1857 నుండి అడవిని వాణిజ్య అవసరాలకు బ్రిటిష్ వారు వినియోగించినా.. నాడు కొన్ని అటవీ సంరక్షణ చట్టాలు వచ్చాయి. రాజ్యాంగ సభలో జరిగిన చర్చ ఫలితంగా రాజ్యాంగంలో 5,6 షెడ్యూలు ఆదివాసుల ఆత్మగా రాజ్యాంగ రక్షణ లభించింది. స్వతంత్ర భారతంలోనూ ఆదివాసీ పోరాటాలు, కమ్యూనిస్టులు, విప్లవ కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగా అటవీ సంరక్షణ చట్టాలు వచ్చాయి. కాని, 2023లో మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన అటవీ సంరక్షణ చట్టం అటవీ రక్షణ చట్టం కాదు.. అటవీభక్షణ చట్టం అన్నారు. కార్పొరేట్లకు కట్టబెట్టే చట్టం మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టం ప్రజలు పోరాడకపోతే రాబోయే కాలంలో ఉన్న రక్షణలు కూడా రద్దు కాబడతాయి. ప్రజలను పోరాటానికి సిద్ధం చేయడంలో ఉపాధ్యాయులు ముఖ్యమైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో విద్యనందించేందుకు 378 ఆశ్రమ పాఠశాలలు, 1933 గిరిజన ప్రాథమిక పాఠశాలు, 190 రెసిడెన్షియల్ స్కూల్స్, 19 ప్రీమిట్రిక్, 161 పోస్ట్ మిస్టేక్ హాస్టల్స్, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలతో పాటు బాలికలకు విద్యకు ప్రత్యేకంగా 3502 కేజీబీవీ పాఠశాలలతో పాటు ఏకలవ్య పాఠశాలలు నెలకొల్పినా ఇప్పటికీ వేలాదిమంది గిరిజన బాల బాలికలు చదువు మధ్యలో మానివేయడం జరుగుతుంది. దీనిపై ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు.

పాఠశాల స్థితిగతులు చాలా దారుణంగా ఉన్నాయని, ఉపాధ్యాయుల కోసం నిర్మించిన క్వార్టర్స్ పూర్తిగా శిధిలమైపోయాయని, కొత్త క్వార్టర్స్ నిర్మించకపోవడం వలన ఉపాధ్యాయుల పాఠశాలలకు దూరంగా వేరే ప్రాంతంలో నివసిస్తున్నారని, ప్రభుత్వం వారంలో రెండు రోజులు పాఠశాలలో రాత్రిపూట తప్పనిసరిగా బస చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసి బలవంతంగా అమలు చేస్తుందని, అన్ని పాఠశాలలకు కాంపౌండ్ వాల్ పూర్తిస్థాయిలో లేకపోవడం, కరెంటు నీరు సదుపాయాలు ఉన్న నిత్యం రిపేర్లకు గురి అవుతూనే ఉండడం ఎలక్ట్రిషన్, ప్లంబర్ ఖర్చులకు ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం వంటి రకరకాల సమస్యలతో పాఠశాలలు సతమవుతున్నాయని పేర్కొన్నారు.

అనారోగ్యంతో అనేకమంది గిరిజన బాలబాలికలు మరణాలు తరచూ సంభవిస్తూనే ఉండడం, జిల్లా కేంద్రాలకు విద్యార్థులను తరలించి వైద్యం అందించడానికి ఎటువంటి నిధులు లేకపోయిన ప్పటికీ ఉపాధ్యాయుల తమ సొంత ఖర్చులతో వైద్యం చేయిస్తున్నారని ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేసారు.

విద్యా రంగంలో ఉపాధ్యాయులు, సిఆర్‌టిలు, భాషా వాలంటీర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్‌లో విషయంలో ప్రత్యేక చట్టం చేయాలని, ప్రధానోపాధ్యాయులకు 5 సం॥లు, మిగిలిన క్యాడర్ల వారికి 8 సం॥లు ఉండే విధంగా మరియు ప్రతి సంవత్సరం బదిలీలు, ప్రమోషన్‌లు నిర్వహించే విధంగా ఉండాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శులు ఎస్.మురళీమోహన్, ఎస్.కిషోర్‌కుమార్, టి.వి.జి.జి.ఆర్.ఆర్.చక్రవర్తి, పి.జయకర్, ఎన్.అరుణకుమారి, పలు తీర్మానాలను ప్రతిపాదించగా ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి.

# అధ్యయనం, ఆచరణతోనే...ఆశయ సాధన



ఎస్.వెంకటేశ్వర్లు
యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు

ఆవేదన, విమర్శ, ప్రతి విమర్శలతో ఆశయం ముందుకు సాగదు. ఆనాడే బాగుంది. నేడు అంతా స్వార్థం పెరిగిపోయింది. నేడు ఏమీ చేయలేం అనే నిరాశ దరి చేరితే ఆశయం సాధించే మార్గం, ఆశయాన్ని సాధించాలనే దృఢ సంకల్పం బలహీన పడిపోతుంది. శరీరం బలహీనపడితే జబ్బులన్నీ ఆవహించినట్లు, ఆచరణ, అధ్యయనం బలహీనపడితే ఆశయం సాధించాలనే పట్టు బలహీన పడుతుంది. నేడు విలువల స్థానంలో డబ్బు ఆధిపత్యం చెలాయి స్తుంది. ఒంటరిగా బ్రతకటం, వ్యక్తిగత ఆనందం కోసం ప్రాకులాడటం, నీ వరకే నీవు, సంతృప్తిని వెతుక్కోవటం కోసం అడ్డదారులు తప్పుకాదు అని చెబుతుంది. అన్యాయం, దోపిడీ, పోరాటం, ఆశయాలు, విలువలు ఎండమావిగా మారిపోతాయి.

స్వాతంత్ర ఉద్యమం, అంతర్జాతీయంగా సోషలిస్టు శిబిరం బలపడటం, సమిష్టితత్వాన్ని, పోరాడే సంకల్పాన్ని, సమాజ అవలక్షణాల్ని మార్చి నూతన సమాజాన్ని సృష్టించే మార్పుని ఆరోజు ఆదర్శంగా కనిపించాయి. సోషలిస్టు సమాజం ఆదర్శంగా కనిపించటమే కాదు ఆచరణలో దేశ సంపద జాతీయం చేయబడింది. శ్రామికులకు అధికారం దక్కింది. ప్రజలకు దక్కిన అధికారాన్ని జాతి దురాహం కారంతో చేజిక్కించుకునే ఫాసిజాన్ని తుదముట్టించి మరికొన్ని దేశాలను సోషలిస్టు సమాజాలుగా మార్చింది. ఈ పరిణామాలన్నీ ప్రపంచంలో ఉన్న శ్రామిక వర్గ ప్రజానీకానికి మంచి స్ఫూర్తి నిచ్చాయి. ఆ స్ఫూర్తిని పొంది భారతదేశంలో భారత జాతీయతను ముందుకు తీసుకొచ్చి బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ఓడించారు. అలా ఓడించిన ఆ ఉద్యమాలలో భాగస్వామ్యులు అయినటువంటి వారు దేశ రాజకీయ నాయకులు, పాలకులుగా, అధికారులుగా, ఉద్యోగ, ఉపాధ్యాయులుగా మారారు. ఆ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ప్రజలు కూడా భారత జాతీయ దేశభక్తి పెంపొందించుకొన్నారు. సొంత లాభం కొంత మానుకొని పొరుగు వానికి తోడు పడవోయ్ అనే గురజాడ గీతంను ఆచరణలో అమలు చేసే దానికోసం ప్రయత్నం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సోషలిస్ట్ శిబిరం, భారతదేశంలో స్వతంత్ర ఉద్యమం దేశ భక్తిని, దేశ జాతీయత భావాన్ని ప్రజలందరిలో రగిలించింది.

1990 తర్వాత సోషల్ శిబిరం బలహీనపడటం, ప్రపంచీకరణ ఆర్థిక సంస్కరణను ముందుకు రావడం, స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న నాయకులు, ఆ తరం క్రమేపీ కనుమరుగవటం ప్రారంభమయినది. ఆనాటి తరం స్ఫూర్తితో 1990 తర్వాత కూడా ఈ దేశానికి సోషలిస్ట్, లౌకిక, ప్రజాస్వామ్య భావాలు అవసరమని భావించేవారు కూడా లేకపోలేదు. వీరు సమాజంలో ఉన్న సమస్యలను గుర్తించి, ప్రజలను చైతన్యం చేసి, ఉద్యమాల్లోకి తీసుకువచ్చే పాత్రను వరకు చేయగలుగుతున్నారు. కానీ ప్రపంచీకరణ భావజాలం నుంచి ప్రజల్ని దూరం చేయలేక పోతున్నారు. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనని వారు సరికొత్త దేశభక్తిని, జాతీయతను ముందుకు తెస్తున్నారు. ఈ భావజాలంకు ప్రజల వేగంగా ఆకర్షితమవు తున్నారు. ఆనాడు బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ప్రజలందరూ కలిసి ఐక్యంగా పోరాడుదాము. నేడు అదే సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ఒక్కమాట కూడా మాట్లాడటంలేదు. మాట్లాడకపోతే ఓకే కానీ వారు చెప్పినట్లుగానే ఎక్కడ ఆయిల్ కొనాలో, ఎక్కడ ఆయిల్ కొనకూడదో, ఎవరితో ఎలా వ్యవహరించాలో వారు చెప్పినట్లుగానే చేయటం ఈ దేశ సార్వభౌమాధికారానికి నష్టం.

సమాజం మార్పు కోరుకునేవారు, స్వాతంత్ర ఉద్యమ ఫలాలు అందరికీ అందాలని కోరుకునే వారు, భారత రాజ్యాంగం ధర్మమే అమల్లో ఉండాలని అనుకునేవారు, ఈ సమాజంలో ప్రజలందరికీ సంపద చెందాలనుకునేవారు, ఈనాడు మనం ఏమి చేయలేం మనం ఏమి మార్చలేం అనుకుంటే అంతిమంగా ఈ దేశాన్ని అలౌకిక శక్తులకు, అశాస్త్రీయ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లే వాళ్ళ చేతుల్లో పెట్టినవారమవుతాం. దేశ ప్రజలను విభజించే జాతీయతా, దేశభక్తి కాదు. స్వాతంత్రోద్యమంలో దేశ ప్రజలందరినీ ఐక్యం చేసిన భారత జాతీయత, భారత దేశభక్తి ప్రధాన అంశాలుగా భావజాల రంగంలో కృషిని పెంచాలి. అననుకూల వాతావరణంలో అనుకూల వాతావరణాన్ని సృష్టించుకొని ప్రజల్ని చైతన్యం చేయటం ఎలాగో తెలుసుకోవాలి. దీనికోసం అధ్యయనం చేయాలి. ఏమి సాధించలేం అనుకున్న ప్రతి సందర్భంలోనూ ఎలా సాధించాలో చిన్న వయసు లోనే విప్లవ ఉద్యమాన్ని రగిలించిన భగత్‌సింగ్, దేశ విశిష్టతను చాటి ప్రజలందరినీ ఐక్యంగా ఉంచటం కోసం దేశభక్తిని చాటిన రాజా రామ్మోహన్ రాయ్, వివేకానంద, అభ్యుదయ భావజాలాన్ని పెంపొందించిన గురజాడ, వేమన, కందుకూరి, జ్యోతిబా, సావిత్రిబాయి పూలే, అంబేద్కర్, సుందరయ్యలను ఆదర్శంగా తీసుకొందాము. ఝాన్సీ లక్ష్మీబాయి, రాణి రుద్రమదేవి, పల్నాటి నాగమ్మ, చాకలి ఐలమ్మ లాంటి జీవిత గాధల్ని నిరంతరం అధ్యయనం చేద్దాం. ఈ అధ్యయనంని ఆచరణలో పెట్టి మన ఆశయాన్ని సాధించడానికి ముందు కదులుదాం. అధ్యయనం మాత్రమే చేసి ఆచరణ చేయకపోతే ఉపయోగం లేదు. ఆచరణ మాత్రమే ముందుకు తీసుకెళ్లి అధ్యయనాన్ని వదిలేస్తే దాని వల్ల కూడా నష్టం.

కులం, మత, ఉన్మాద, అశాస్త్రీయ భావజాల, తుఫాను, సునామీ ఏర్పడినప్పుడు స్థిరంగా నిలబడాలన్నా, చుట్టూ ఉన్న ప్రపంచీకరణ ప్రభావాలకు లోనుకాకుండా ఉండాలన్నా, అభ్యుదయం వైపు నిలబడాలన్నా అధ్యయనమే మనల్ని నిలబెడుతుంది. అది ఆచరణ వైపు తీసుకెళ్తే అదొక ఆయుధంగా పనిచేస్తుంది.

స్వాతంత్రోద్యమ ఫలాలు, భారత రాజ్యాంగ ధర్మాలు, అమలు కోసం, భావితరానికి ఈ భావజాలాన్ని అందించడం కోసం, అధ్యయనం చేద్దాం. భావితరాన్ని లౌకిక, ప్రజాస్వామ్య, సోషలిస్ట్ భావజాలంతో అభివృద్ధి చేద్దాం.




# మహిళా చట్టాలు అమల్లో చిత్తశుద్ధి ఉండాలి

2026 ఏప్రిల్ 19న విజయవాడలో జరిగిన రాష్ట్ర మహిళా సదస్సుకు ముఖ్య అతిథిగా ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షురాలు కా॥ కె.బదరున్నీసా హాజరయ్యారు. దేశ వ్యాప్తంగా విద్యారంగంలో మహిళా ఉపాధ్యాయులు వహిస్తున్న కీలకపాత్ర వివరించారు. ఆమె మాటల్లో ....

నాగరికత మరియు సమాజ అభివృద్ధికి ఉన్న అనేక ముఖ్యమైన సాధనాలలో విద్య అత్యంత శక్తివంతమైనదని మనకు తెలుసు. విద్య ద్వారా మనం మన జీవితానికి మరియు సమాజానికి మెరుగైన పరిస్థితులను సృష్టించగలము.

"భారతదేశ భవిష్యత్తు ఇప్పుడు దాని తరగతి గదులలో రూపుదిద్దుకుంటోంది" అని కొఠారి విద్యా కమిషన్ చెబుతోంది. అవును – మన తరగతి గదులలో కూర్చున్న మన విద్యార్థులను తీర్చిదిద్దడం ద్వారా మనం భారతదేశాన్ని తీర్చిదిద్దుతున్నాము. కొఠారి కమిషన్ భవిష్యత్తు గురించి చెప్పింది – అదే సుసంపన్నమైన భారతదేశం.

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మరియు ఆంధ్రప్రదేశ్‌తో సహా చాలా రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ విద్యా విధానం 2020 (NEP 2020)ని అమలు చేయడం ద్వారా విద్యా రంగానికి ఒక కొత్త దిశానిర్దేశం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. జాతీయ విద్యా విధానాన్ని మొదటి దశలోనే అమలు చేసిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. అప్పటి నుండి 'APUTF' నిరంతర పోరాటంలో నిమగ్నమై ఉంది.

– మోడీ ప్రభుత్వం అమలు చేసిన జాతీయ విద్యా విధానం (NEP) యొక్క అత్యంత తీవ్రమైన ప్రభావం ఏమిటంటే, విద్య యొక్క ప్రైవేటీకరణ. దీనివల్ల విద్య మరింత ఖరీదైనదిగా మారుతుంది.

– భారతదేశాన్ని కాంగ్రెస్ పార్టీ పరిపాలిస్తున్న సమయంలోనే, ప్రభుత్వ విద్యా రంగం యొక్క ప్రైవేటీకరణ ప్రక్రియ అప్పుడే ప్రారంభమైందని మనకు తెలుసు.

– 1990ల వరకు విద్య అనేది పూర్తిగా ప్రభుత్వ బాధ్యతగానే కొనసాగింది, సమాజంలో విద్యకు ఉన్న ఆదరణ మరియు డిమాండ్ నిరంతరం పెరుగుతూనే వచ్చింది. అదే సమయంలో, అంతర్జాతీయ ఒత్తిళ్ల కారణంగా ప్రభుత్వ విధానంలో ఒక మౌలికమైన మార్పు చోటుచేసుకుంది.

**IMF మరియు ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థలు ప్రభుత్వాలకు ఒక నిర్దిష్ట ఆదేశాన్ని జారీ చేశాయి:** సంక్షేమ కార్యక్రమాలన్నింటినీ కేవలం ప్రభుత్వ పెట్టుబడుల ద్వారానే పూర్తి చేయకూడదని, సంక్షేమ మరియు సేవా రంగాలలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించాలని ఆ సంస్థలు ప్రభుత్వాలకు సూచించాయి. ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానం ఫలితంగా ప్రభుత్వ విద్యారంగం మరియు ఇతర అన్ని సేవా రంగాల నుండి వైదొలగాల్సి వచ్చింది. ఇప్పుడు మోదీ ప్రభుత్వం జాతీయ విద్యా విధానం (NEP) ద్వారా ప్రభుత్వ విద్యారంగ ప్రైవేటీకరణను ముమ్మరంగా అమలు చేస్తోంది.

2014 వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నిష్పత్తి వరుసగా 7:5గా ఉండగా, అది ఇప్పుడు 4:6కి పడిపోయింది. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య నిరంతరం తగ్గుతుండగా, ప్రైవేట్ పాఠశాలల సంఖ్య నిరంతరం పెరుగుతోంది.

ప్రైవేట్, తక్కువ బడ్జెట్ పాఠశాలల పెరుగుదల ఒక రకమైన అస్థిరమైన వ్యవస్థాపకతను ప్రోత్సహించింది. దీనిలో మహిళా ఉపాధ్యాయులను తక్కువ వేతనాలకు, తక్కువ ప్రయోజనాలతో నియమించుకుంటున్నారు. తరచుగా వారు చర్చలు, పోటీల ద్వారా దీనిని సాధిస్తున్నారు. ప్రైవేట్ సంస్థలలో కూడా ప్రసూతి సెలవును అనుమతించాలనే డిమాండ్‌ను పట్టించుకోవడానికి అధికారులు ఇంకా సిద్ధంగా లేరు.

కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు 'పాఠశాల సముదాయాల' (School Complexes) పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని నిర్ణయిస్తున్నాయి. భారతదేశంలో ఇప్పటికే సుమారు లక్ష పాఠశాలలు మూసివేయబడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా వందలకొద్దీ పాఠశాలలు మూసివేయబడ్డాయని, మరికొన్ని మూసివేతకు సిద్ధంగా ఉన్నాయని మనం వార్తల్లో చదువుతున్నాము.

సమాజంలోని అణగారిన వర్గాలపై, ముఖ్యంగా ఎస్సీ/ఎస్టీ మరియు బాలికలపై దీని ప్రభావం గురించి వారికి ఎలాంటి ఆందోళన లేదు. పాఠశాలల మూసివేతలు మరియు విలీనాల వల్ల విద్యార్థులు ఎక్కువ దూరం ప్రయాణించవలసి వస్తుంది. ఇది నిరుపేద వర్గాలపై అసమానంగా ప్రభావం చూపుతుంది మరియు బడి మానేసే వారి సంఖ్య పెరగడానికి దారితీస్తుంది.

## గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడుకోవాలి




**ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయుల 6వ రాష్ట్ర సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కా॥ కె.లోకనాథం "గిరిజన సంస్కృతి - ముంచుకొస్తున్న ప్రమాదాలు" అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...**

**ఈ రోజు జరుగుతున్న పరిణామాలు ఏజెన్సీ ప్రాంతానికి మనం ఉంటున్న ప్రాంతానికి, చదువుకున్న ప్రాంతానికి, చదువు చెప్తున్న ప్రాంతానికి చాలా ప్రమాదకరంగా ఉన్నాయని ఇదే కొనసాగితే భవిష్యత్తు మన చేతిలో ఉండదని అన్నారు. ఇలాంటి సమయంలో జరుగుతున్న ఈ రాష్ట్ర సదస్సుకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ఈ సదస్సు ద్వారా భావజాల రంగంలో ఆధిపత్యం సాధించాలని కోరారు.**

**ఏజెన్సీ ప్రాంతంలో సంస్కృతికి ప్రమాదం ఏర్పడుతోందని, రాజ్యాంగం లో తెలిపినట్టు ఏ ప్రాంతంలోనైనా ఉన్న సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉందని, కాని, పరిరక్షించాల్సిన పాలకులే సంస్కృతి సాంప్రదాయాలు నిర్వీర్యం చేస్తున్నారని, పండగ వస్తే ఆట.. చేలేస్తే పాట.. వెళుతుంటే మాట.. అన్ని సంస్కృతులు నాశనమౌతున్నాయని పేర్కొన్నారు. సమాజాన్ని పురోభివృద్ధిలో నడిపించాల్సిన బాధ్యతతో బాటు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాల్సిన కర్తవ్యం కూడా ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. ప్రధానంగా గిరిజన ప్రాంతాలలో ప్రకృతితో ముడిపడిన సంస్కృతి సాంప్రదాయాలు క్రమక్రమంగా కనుమరు గవుతున్నాయని, వీటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.**

విలీనాల ఫలితంగా ఉపాధ్యాయ మరియు ప్రిన్సిపాల్ పోస్టులు తగ్గిపోతాయి, ఇది ఉద్యోగ అభద్రతకు దారితీసి, భవిష్యత్ నియామకాలపై ప్రభావం చూపుతుంది.

అంతేకాకుండా, సుప్రీం కోర్టు తీర్పును ప్రస్తావిస్తూ, వారు ౹జు పరీక్షను తప్పనిసరి చేస్తున్నారు. వారు ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులను కూడా ఈ వృత్తి నుండి తొలగించడానికి ప్రయత్నిస్తు న్నారు. దీని ప్రభావం మహిళా ఉపాధ్యాయులపైనే ఎక్కువగా పడుతుంది. గృహ బాధ్యతల కారణంగా, TET పరీక్షకు సన్నద్ధం కావడానికి మహిళలకు లభించే సమయం చాలా తక్కువగా ఉంటుంది. ఉపాధ్యాయులకు అనుకూలంగా చట్టాన్ని సవరించడం పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం ఆసక్తి లేదు. TET విధానానికి వ్యతిరేకంగా STFI సుప్రీం కోర్టులో ఒక కేసు దాఖలు చేసింది.

శాస్త్రీయ చైతన్యం, హేతుబద్ధమైన ఆలోచనలపై దాడి చేయడం మరో అంశం. ఇది రాజ్యాంగం సూచించిన శాస్త్రీయ దృక్పథాన్ని అప్రస్తుతం చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం తమ ప్రయోజనాలకు అనుగుణంగా విద్యా విషయాలను మార్చడానికి ప్రయత్నిస్తోంది. మహిళలకు, వికలాంగులకు వ్యతిరేకమైన తమ మను సిద్ధాంతానికి అంగీకారం కూడగట్టే ఉద్దేశ్యంతో వారు విద్యను మతతత్వీకరించే మార్గంలో ఉన్నారు.

'బేటీ బచావో, బేటీ పఢావో' అనే నినాదాన్ని ముందుకు తీసుకురావడం తప్ప, బాలికల విద్యను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఇది మోదీ ప్రభుత్వానికి కేవలం ఒక ప్రజా సంబంధాల వ్యవహారంగా మారిపోయింది. కేటాయించిన నిధులలో అధిక భాగం ప్రచారానికే వినియోగించ బడింది.

ఆర్థిక సహాయం కల్పించే నెపంతో, విద్యారంగంలో రాష్ట్రాలకు ఉన్న అధికారాలను హస్తగతం చేసుకుని---తద్వారా తమ స్వంత అజెండాను అమలు చేయడానికి వారు ప్రయత్నిస్తున్నారు. నూతన విద్యా విధానం (NEP)పై నిరసన వ్యక్తం చేస్తున్న కేరళ మరియు తమిళనాడు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం నిధులను నిరాకరించింది. ప్రధానమంత్రి శ్రీ (PM-SHRI) పథకాన్ని కేరళలో అమలు చేయలేదన్న కారణంతో, ఆ రాష్ట్రానికి దక్కాల్సిన రూ. 1500 కోట్ల సమగ్ర శిక్ష నిధులను నిలిపివేసింది.

కేరళ ప్రత్యామ్నాయ విద్యను ప్రవేశపెట్టి, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తోంది. మీకు తెలుసా, భారతదేశంలో తీవ్ర పేదరికాన్ని నిర్మూలించిన మొట్టమొదటి రాష్ట్రం కేరళ. మా తరగతి గదులలో ఆకలితో అలమటించే విద్యార్థి ఎవరూ లేరు. కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ పాలనలో ఏ పాఠశాలలూ మూతపడలేదు. గత 10 సంవత్సరాలలో, ప్రభుత్వ మరియు ప్రభుత్వ-సహాయక పాఠశాలల్లో మరో 10 లక్షల మంది విద్యార్థులు చేరారు. పాఠశాలల నిర్మాణం మరియు ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం 6000 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసింది. ప్రభుత్వ పాఠశాలలు హైటెక్ పాఠశాలలుగా మారాయి. కేరళలో, పాఠశాలల్లో పౌష్టికరమైన మధ్యాహ్న భోజనం మరియు అల్పాహారం లభిస్తాయి. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.13,500 మంచి జీతం లభిస్తోంది. ఇందులో కేంద్ర వాటా కేవలం 600 రూపాయలు మాత్రమే, అంటే 1000లో 60 శాతం. ఆంధ్రప్రదేశ్‌లో మధ్యాహ్న భోజన కార్మికుల వేతనం రూ.3000 అని నేను అనుకుంటున్నాను.

అంతేకాకుండా, కామ్రేడ్ పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, విద్యార్థి ప్రతినిధులు మరియు సాధారణ ప్రజలతో చర్చించిన తర్వాత ప్రగతిశీల పాఠ్యప్రణాళిక సవరణను అమలు చేసింది. పాఠ్యప్రణాళిక సవరణ తర్వాత అన్ని పాఠ్యపుస్తకాలు పునరుద్ధరించబడ్డాయి.

కేరళ లింగ ఆధారిత విద్యను నిర్ధారిస్తుంది. సిలబస్ మరియు పాఠ్యపుస్తకాలు తదనుగుణంగా రూపొందించబడి, అమర్చబడ్డాయి. కేరళ సంపూర్ణ డిజిటల్ విద్యా రాష్ట్రంగా కూడా గుర్తింపు పొందింది. కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో గ్రాడ్యుయేషన్ స్థాయి వరకు ఉచిత విద్యను ప్రకటించింది. కేరళ విద్యా విధానం జాతీయ నూతన విద్యా విధానానికి ప్రత్యామ్నాయ విద్యా విధానమని ఋజువైంది.

ఈ నేపథ్యంలో జాతీయ నూతన విద్యావిధానంలోని వినాశకరమైన అంశాలను తొలగించి ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి, ప్రజలందరికీ విద్య అందించేలా సరికొత్త విద్యా విధానాన్ని రూపొందించాలి. కేంద్ర ప్రభుత్వం తమ విధానాలను మార్చుకుని ప్రత్యామ్నాయ విధానాలను అనుసరించేవరకు మన పోరాటం కొనసాగించాలి.



# మహిళా టీచర్ల సమస్యల పరిష్కారానికై ఉద్యమిద్దాం

పాఠశాల విద్యారంగంలో మహిళా టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించేందుకు సన్నద్ధ కార్యక్రమంలో భాగంగా 2026 ఏప్రిల్ 19వ తేదీన మహిళా టీచర్ల రాష్ట్ర సదస్సు విజయవాడలో జరిగింది.

ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి ఎన్ అరుణకుమారి మాట్లాడుతూ పూలే, అంబేద్కర్ వారసులుగా మహిళా ఉపాధ్యాయులు వీరేశలింగం గారు కోరుకున్నట్లు బాలిక విద్య కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సదస్సును ప్రారంభించిన రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీభాయి, లక్ష్మీసెహగల్, రుద్రమదేవి, సావిత్రీభాయి, చాకలి ఐలమ్మ వంటి వారు మహిళా ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఉద్యమం నిర్మించడంలోనూ, కొనసాగించడంలోనూ ఉత్పత్తికి ఆద్యులైన మహిళలే కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించడంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాజ్యాంగం మహిళలకు బాలికలకు అనేక రక్షణలు కల్పించిందని వీటి పరిరక్షణలో మహిళా ఉపాధ్యాయులుగా ప్రధాన భూమిక వహించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వము మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీ–లిమిటేషన్ బిల్లును అనుసంధానించడాన్ని కేంద్ర ప్రభుత్వ తప్పిదంగా అభివర్ణించారు.

ఎస్‌టిఎఫ్ఐ సీనియర్ నాయకులు ఎం. సంయుక్త మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఉద్యమ చరిత్రలో మహిళలకు ప్రత్యేకస్థానం ఉందని అన్నారు. వారిని ఉద్యమాల్లోకి తీసుకురావడంతోపాటు ఉ పాధ్యాయులు అనుభవిస్తున్న సౌకర్యాలు తీసుకురావడంలోనూ యుటిఎఫ్ ఎంతో కృషి చేసిందని తెలిపారు. సంప్రదాయాల పేరుతో చైతన్యాన్ని బలహీనపరిచే విషయాల నుంచి బయటకు వచ్చి అభ్యుదయ భావాలను పెంపొందించుకోవడానికి కృషి చేయాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వాల తీరుతో ఇప్పటికీ పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వీటిని ఇప్పటికే ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పరిష్కారం కాకపోతే జులై నుండి ఆందోళన చడపతామని అన్నారు.

ఈ సదస్సుకు రాష్ట్ర కార్యదర్శి కే. దేవేంద్రమ్మ ఆహ్వానం పలుకగా రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు బి శ్రీదేవి వందన సమర్పణ చేశారు. ఈ క్రింది తీర్మానాలు రాష్ట్ర కార్య దర్శులు బి. సుభాషిని, వి .శ్రీలక్ష్మి ప్రవేశపెట్టారు.

**సదస్సు డిమాండ్లు :**

1) ప్రతి ఉన్నత పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులకు ప్రత్యేక Staff Room ఏర్పాటు చేయాలి.
2) పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులకు ప్రత్యేక టాయిలెట్స్, వాష్రూమ్స్ ఏర్పాటు చేయాలి.
3) పుస్తకాలు, ప్రశ్నాపత్రాలు తీసుకురావడం, రైస్ ఇండెంట్ ఇవ్వడం మొ॥ పనుల నుండి మినహాయింపు ఇవ్వాలి.
4) మహిళా టీచర్ల భద్రత నిమిత్తం ఒక ప్రొటెక్షన్ సెల్ జిల్లా స్థాయిలో ఏర్పాటు చేయాలి.
5) ఒత్తిడి తగ్గించేందుకు ప్రతి హైస్కూల్లో స్ట్రెస్ మేనేజ్మెంట్ కౌన్సిలర్‌ను ఏర్పాటు చేయాలి.
6) పిల్లల అనారోగ్యం, చదువుల నిమిత్తమే కాక పెండ్లి అయిన బిడ్డలకు తీవ్ర అనారోగ్యం, శస్త్ర చికిత్స మరియు డెలివరీ సమయాలలో కూడా వినియోగించుకునే విధంగా చైల్డ్కర్ లీవును మార్పు చేయాలి.
7) తల్లిదండ్రులు, అత్తమామలు సంరక్షణకు సంవత్సరానికి 10 రోజులు పేరెంటల్ కేర్ లీవ్ మంజూరు చేయాలి.
8) జిల్లా స్థాయిలో ఉచిత న్యాయసలహా కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

పై డిమాండ్లు సాధనకై ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయాలని, మే, జూన్ నెలల్లో అన్ని జిల్లాలోనూ మహిళా సదస్సులు నిర్వహించాలని, ప్రభుత్వం స్పందించకపోతే దశలవారీ పోరాటానికి సంసిద్ధం కావాలని సదస్సు నిర్ణయించింది.

# ప్రశ్నోత్తరాలు



E-Mail Id
ikyopadhyaya1975@gmail.com
నిర్వహణ : టి.ఎస్.ఎల్.ఎన్.మల్లేశ్వరరావు
రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయిని అబార్షన్ సెలవు పెట్టియున్నారు. అబార్షన్ సెలవు మే 9తో ముగుస్తుంది. ఆమె వేసవి సెలవుల ముందు రోజు పాఠశాలకు హాజరు కావలెనా?

– ఫాతిమా, గుంటూరు

**జవాబు** : అవసరం లేదు. వేసవి సెలవులను సఫిక్స్‌గా మంజూరు చేస్తారు.

**ప్రశ్న** : ఉన్నత పాఠశాలలో ఎఫ్ఏసి ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న ఉపాధ్యాయునికి అలవెన్స్ ఎలా చెల్లిస్తారు?

– కె.కిషోర్, కాకినాడ

**జవాబు** : ఎఫ్ఆర్ 49 ప్రకారం అదనపు బాధ్యతలకు మొదటి మూడు నెలలకు మూలవేతనంలో 1/5 వంతు, తదుపరి 3 నెలలకు మూలవేతనంలో 1/10 వంతు చెల్లిస్తారు. దానికి డిఏ, హెచ్ఆర్ఏ కూడా చెల్లిస్తారు.

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయుడు 165 రోజులు జీత నష్టం సెలవు పెట్టి యున్నారు. ఆయన నవంబరు 20వ తేదీన ఉద్యోగంలో చేరారు. ఇంక్రిమెంట్ నవంబర్ నెలలో ఉంది. జీతనష్టపు సెలవును ఏ రోజు నుండి లెక్కించాలి.

– సీతారామయ్య, గుంటూరు

**జవాబు** : ఆయన ఉద్యోగంలో ఏ తేదీన చేరినప్పటికీ జీత నష్టంపు సెలవు వలన ఇంక్రిమెంట్ వాయిదా వేయవలసిన సందర్భంలో నవంబరు 1వ తేదీ నుండి లెక్కించాలి.

**ప్రశ్న** : పంచాయితీరాజ్ శాఖలో పనిచేస్తున్న ఒక ఉద్యోగికి క్యుములిటెవ్ ఎఫెక్ట్ లేకుండా రెండు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేసారు. ఆ ఇంక్రిమెంట్లు ఎలా మంజూరు చేస్తారు?

– పి.ఎస్.నరసింహారావు, నెల్లూరు

**జవాబు** : ఆయనకు రెండు సంవత్సరములు ఇంక్రిమంట్ ఉండదు. మూడవ సంవత్సరం మూడు ఇంక్రిమెంట్లు కలిపి ఇస్తారు. అంటే ఆయన రెండు సంవత్సరములు ఇంక్రిమెంట్ అరియర్స్ కోల్పోతారు.

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయుడు సెలవుపై విదేశాలకు వెళ్ళి 5 సం॥లు దాటింది. ఆయన సర్వీసు ఏ విధంగా లెక్కించాలి.

– ఎస్.శ్రీనివాస్, చిత్తూరు

**జవాబు** : ఎఫ్ఆర్ 18(సి) ప్రకారం 5 సం॥లు మించి గైరు హాజరు అయిన పక్షంలో రాజీనామా చేసినట్లు భావించ బడుతుంది.

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయుడు అనారోగ్యము కారణంగా ఒక రోజు మెడికల్ లీవుకు దరఖాస్తు చేసారు. ఒక రోజుకు మెడికల్ లీవు మంజూరు చేయటం కుదరదు అంటు న్నారు. వాస్తవమేనా?

– ఎల్.శ్రీలక్ష్మి, విజయవాడ

**జవాబు** : ఎఫ్ఆర్ 15(బి) ప్రకారం ఒక రోజుకు కూడా మెడికల్ లీవు మంజూరు చేయవచ్చు.

**ప్రశ్న** : ఒక ఉద్యోగి సస్పెన్షన్‌లో ఉండగా మరణించారు. ఆయనకు జీతం ఎలా చెల్లించాలి?

– కె.సాహిత్య, భీమవరం

**జవాబు** : ఎఫ్ఆర్ 54 ప్రకారం ఆయన సస్పెన్షన్ మరియు మరణించిన తేదీల మధ్య కాలాన్ని డ్యూటీగా పరిగణించి మొత్తం జీత భత్యాలు చెల్లించాలి. సబ్‌ట్యూషన్ అలవెన్స్ మినహాయించాలి.

ప్రపంచ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు

# శ్రామిక సార్వభౌమత్వం

– కరణం పద్మజ, వెల్దుర్తి, కర్నూలు జిల్లా




నువ్వు చేయి ఉపసంహరిస్తే..
ఈ మహానగరాలన్నీ నిశ్చల చిత్రాలు!
నీ పిడికిలి విప్పేస్తే..
ఈ యంత్రాలన్నీ కేవలం ఇనుపరాశులు!
ఆకాశహర్మ్యాల అద్దాల మీద మెరిసే నీడవు కాదు నువ్వు..
ఆ సౌధాల వెనుక ఊపిరి బిగబట్టి నిలబడ్డ నిర్మాణ కర్తవు నీవు!
నువ్వు విరామం ప్రకటిస్తే..
ప్రపంచపు ప్రగతి వేగం స్తంభించిపోతుంది..
రైలు పట్టాల మీద మౌనం రాజ్యమేలుతుంది..
నువ్వు వంచిన నడుము నిటారుగా నిలబడితే..
అభివృద్ధి రథం.. కదలని శిలా రూపం అవుతుంది!
చికాగో వీధుల్లో చిందిన నెత్తురు.. నీ అరచేతిలో చట్టమైంది!
నీ ప్రాణ బలిదానమే.. నేడు కార్మిక లోకానికి రక్షణ కవచమైంది!
?మే డే అంటే కేవలం క్యాలెండర్లో సెలవు దినమా? కాదు!
నీ శ్రమకు ఈ జగత్తు చెల్లించాల్సిన గౌరవ రుణం!
ఓ శ్రామిక వీరుడా..
నీవు కేవలం ఉత్పత్తి యంత్రానివి కాదు..
ఈ సమాజపు విచ్ఛిన్నం కాని ప్రాణ స్పందనవు!
నీ ఐక్యత గొంతు విప్పితే..
దోపిడీ రాజ్యపు గోడలు బీటలు వారుతాయి..
నీ అడుగు ముందుకు పడితే..
సరికొత్త చరిత్ర ఉదయిస్తుంది!
నీ ఐక్యతే నీ దీక్ష..
అది నీ ఆత్మగౌరవ రక్ష!
చెమట చుక్క సాక్షిగా..
సాగుదాం సమరపథంలో - గెలుపు మనదే!

## ఐక్యఉపాధ్యాయ

| | | |
|---|---|---|
| సంవత్సరం చందా | రూ. | 200.00 |
| 2 సం॥ల చందా | రూ. | 375.00 |
| అర్ధ దశాబ్ది చందా (5 సం॥లు) | రూ. | 850.00 |

## ఐక్యఉపాధ్యాయలో ప్రకటన రేట్లు

| | | |
|---|---|---|
| 4వ కలర్ పేజీ | రూ. | 30,000.00 |
| 2,3 కలర్ పేజీ | రూ. | 20,000.00 |
| లోపలి కలర్ పేజీ | రూ. | 15,000.00 |

# చైతన్యం __ సవాళ్ళు



కె.ప్రమీలరాణి
జెడిహెచ్ఎస్, వీరఘట్టం

ఏప్రిల్ 19వ తేదీన జరిగిన మహిళా ఉపాధ్యాయినిల రాష్ట్ర సదస్సు నందు, నేడు వృత్తి రీత్యా ఉపాధ్యాయినులు ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళల హక్కుల సాధన, మహిళల సమస్యలపై ప్రభుత్వ వైఖరి, మహిళా ఉద్య మాలకు స్ఫూర్తి దాతలైన మహనీయ స్త్రీమూర్తుల కోసం, ఉపాధ్యాయ ఉద్యమాల్లో మహిళా ఉపాధ్యా యినుల పాత్ర మొదలగు అంశాలను చర్చించు కున్న వేదికైంది. ఈ సందర్భంలోనే స్త్రీల సమస్యలు, వాళ్ళు సమాజంతో, కుటుంబంతో జరుపుతున్న పోరాటాలు కూడా స్పృశించుకోవడం సముచితం.




సమాజం బాగుండాలంటే మహిళలు బాగుండాలి. వేర్వేరు పాత్రలు పోషిస్తున్న మహిళలు సమాజ మూలస్థంభాలు. పూర్వీకులు ఇచ్చిన పోరాట పటిమ, సంస్కారం మహిళల వారసత్వ సంపద.

### సమాజంలో మహిళల పాత్ర:

"మహిళల జీవన ప్రమాణాలు దేశ అభ్యున్నతికి కొలమానాలు" అన్నారు నెహ్రూ. నేటి మహిళలు క్రియాశీలకంగా తనంతట తాను నిర్ణయాలు తీసుకొనే శక్తిని సాధించింది. నేటి మహిళ చాలా వరకు మహిళాసాధికారితా పథంలోనే సాగుతోంది. కేరళ, మిజోరాం వంటి రాష్ట్రాల్లో స్త్రీలు విద్య, వైద్య, సాంకేతిక రంగాల్లో చొరవగా అడుగుపెట్టి ఆయా సమాజాల్లో పెద్ద పెద్ద మార్పులు తేవడంలో కీలక పాత్ర వహించారు. ఉపాధ్యాయులైన మహిళలు సమాజంతో అవినాభావ సంబంధాలు కలిగి ఉండి, వాళ్ల ఆలోచనలు సదస్సులు, సేవల ద్వారా సామాజిక స్ఫూర్తి, చైతన్యం పెంచగలిగారు. భర్తల వేధింపులు, మానసిక హింసను మొదటిసారిగా అడ్డుకున్నది డాక్టర్లు, టీచర్లుగా ఉద్యోగాల్లో ప్రవేశించిన మహిళలే. నేడు ఉద్యోగినులు అయిన మహిళలే కాకుండా సామాన్య గృహిణులు, మహిళలు కూడా తమ వంతుగా చాలా విషయాల్లో పరిణతిగా ఉంటూ... పిల్లల పెంపకం, విద్యా, వ్యాపార, సాంఘిక విషయాలలో చురుకుగా ఉంటూ పరిణతి సాధిస్తున్నారు. తద్వారా సమాజ ఉన్నతికి దోహదపడుతున్నారు.

### మహిళల భద్రత???:

అంతరిక్ష, వ్యాపార, కార్మిక, విద్యా, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్నా.... ఆయా రంగాల్లో భద్రత మాత్రం ప్రశ్నార్థకమే. మహిళలపై జరుగుతున్న భౌతిక, లైంగిక, మానసిక దాడులు మాత్రం అధికమే అని పత్రికల్లో కథనాలు, పసిపిల్లల మొదలు పండు ముసలిపై సహితం జరుగుతున్న అకృత్యాలు తెలుపుతు న్నాయి. రాష్ట్ర డీజీపీ వెల్లడించిన లెక్కల ప్రకారం 2024తో పోల్చితేనిరుడు రాష్ట్రంలో మహిళలపై నేరాలు 3% పెరిగాయి. 4467 అత్యాచార కేసులు చోటుచేసుకున్నాయి. స్త్రీల ప్రతిష్టకు భంగం కల్గించే కేసులు 9% పెరిగాయి. మహిళలపై 16,000 పైగానేరాలు జరిగినట్లు ఆధారాలు నమోద య్యాయి. మహిళలపై దాష్టికాలకు సంబంధించి 2023లో NCRB లెక్కల ప్రకారం 4.48 లక్షల కేసులు మాత్రమే వెలుగులోకి వచ్చాయి. ఇంకా రానివి ఎన్నో.. ఐతే దురదృష్టవశాత్తు ఇందులో 30% భర్తలు లేదా వాళ్ళ దగ్గరి వృద్ధువుల క్రూరత్వంకు సంబంధించినవే.

### ఆధునిక మహిళలు ఎదుర్కుంటున్న సవాళ్లు:

ఏ రంగంలోనూ పురుషాశక్తికి తామేమీ తక్కువ కాదని నిరూపించుకుంటున్న నేటి ఆధునిక మహిళలు తమకు నచ్చినట్లు జీవించడానికి రాజ్యాంగపరమైన హక్కులను కూడా కలిగి యున్నానూ ఇంకా సమాజంలో పురుషాధిక్య భావజాలం, పితృస్వామ్య విధానం డామినేట్ చేస్తున్నాయనడంలో సందేహం లేదు.స్త్రీలు కొన్ని విషయాలలో నామమాత్రంగా మాత్రమే (రాజకీయ రంగం) ఉండవలసిన పరిస్థితి.అలాగే లింగ సమానత్వం, వేతన సమానత్వం మొదలైన వాటిలో వెనుకబడే ఉన్నారు. ఉన్నత విద్య గల మహిళలు సైతం సామాజిక,మానసిక, ఆరోగ్య, వృత్తిపరమైన అసమానతలు ఎదుర్కుంటున్నారు.తాము పనిచేస్తున్న ప్రదేశాల్లో సమాన ప్రాధాన్యత లేకపోవటం,సమాన పనికి సమాన వేతనం లేకపోవటం, సలహాలకు విలువ లేకపోవటం, గౌరవం లభించక పోవడం, అవమానాలు వాళ్ల ముందున్న సవాళ్లు. తమపై జరుగుతున్న హింసను బయటకు చెబితే తమ వ్యక్తిత్వంను సమాజం తప్పు పడుతుందనీ, కుటుంబ పరువు పోతుందనీ లేదా వ్యవస్థ పై నమ్మకం లేక తమ బాధను పంటి బిగువున దాచుకుంటూ తమలో తాము నరకయాతన పడుతున్న మహిళలు దిగువ తరగతిలో కన్నా మధ్యతరగతి, ఎగువ తరగతుల్లోనే అధికం.

సమాజంలో మహిళలు అనుభవిస్తున్న పీడనా తీవ్రతపై 31

నగరాల్లో జరిపిన సర్వేలో, అందులో పాల్గొన్న మహిళల్లో 40% మంది తాము ఉంటున్న పట్టణాల్లో తమకు భద్రత లేదని చెప్పారు. 25%మంది స్త్రీలు తాము ఎదుర్కుంటున్న హింసను బయటకు చెప్పుకోలేక నరకయాతన పడుతున్నారు. మానసిక, శారీరక, ఆర్థిక, గృహహింసలను మౌనంగా భరిస్తూ సమాజంలో మెలుగుతున్నారు. కుటుంబ, ఉద్యోగ, పిల్లల బాధ్యతలతో ఆరోగ్యంపై శ్రద్ధ లేక ఒత్తిడి, డిప్రెషన్, చిరాకు లాంటివి ఎదుర్కుంటూ దయనీయ స్థితిలో ఉంటూ కూడా సామాజిక కర్తవ్యంలను నిర్వహిస్తున్నారు.

**పరిష్కారం ఏమిటి?:**

అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ ఆయుధాలుగల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నిర్వహించిన రాష్ట్ర మహిళా సదస్సుకు అనూహ్యమైన మహిళా చైతన్యం పెల్లుబికింది. చైతన్యవంతమైన ఉపాధ్యాయినులు చైతన్యవంతమైన సమాజనిర్మాణంలో చురుకైన పాత్ర వహించగలరు. తమ సమస్యలపై, ఆత్మగౌరవంపై గళం విప్పి మాట్లాడే పోరాట పటిమను పెంచడంలో ఇలాంటి సదస్సులు, సమావేశాలు దోహదం చేయగలవు. ఎందుకంటే మహిళల సమానత్వం ఇల్లు, బడి, గుడి నుండే మొదలవ్వాలి. ఇంటిలో తల్లితండ్రులు, బడిలో ఉపాధ్యాయులు అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలను పెంచితే అమ్మాయిలు దేనిలోనూ తక్కువకాదని చిన్నప్పటినుండే మగపిల్లలను మానసిక సంసిద్ధులం చేయాలి. 'వాడికేంటి మగ మహారాజు' అనే భావన చెరిపేయాలి.

అమ్మాయిలకు ఆర్థిక వ్యవహారాలు, అబ్బాయిలకు వంట పని నేర్పే సంస్కృతి నేర్పాలి. బడుల్లో, విశ్వవిద్యాలయాల్లో నైతిక చదువులకు ప్రాధాన్యత ఇవ్వాలి. అంతర్జాలంలో, ఓటిటిలో పెచ్చురిల్లుతున్న అశ్లీలతలపై అడ్డుకట్ట వేయాలి. మహిళల సమస్యలను కుటుంబం, సమాజం అర్థం చేసుకొని సహకారం, మద్దతు అందించాలి. ప్రజా సంఘాలు, యుటియఫ్ లాంటి అభ్యుదయ సంఘాలు ఎప్పటికప్పుడు మహిళా సమస్యలపై అధ్యయన సదస్సులు నిర్వహిస్తున్నాయి.బాలికలను విద్యకు దూరం చేసే ఎన్ఇపి విధానాలు, 131రాజ్యాంగ సవరణ పేరుతో మహిళా బిల్లును డెలిమిటేషన్ యాక్టుతో ప్రవేశపెట్టిన రాష్ట్ర, కేంద్ర విధానాలు స్త్రీల భద్రత, వాళ్ల హక్కుల సాధనపై వాళ్ల నిజాయితీని ప్రశ్నిస్తున్నాయి. ప్రభుత్వాలు మహిళా అభ్యున్నతి గురించి మేడిపండు లాంటి మాటలు, పసలేని చట్టాలు చేసి చేతులు దులుపేసుకోకుండా అవి నిజంగా కార్యరూపం దాల్చేలా పర్యవేక్షించాలి. రాజ్యాంగ పరంగా మహిళలకు కల్పించిన హక్కులను, రిజర్వేషన్లను తూ.. తూ.. మంత్రంగా కాకుండా చిత్త శుద్ధి కలిగివుండాలి. మహిళలు తమ వంతుగా తాము చైతన్యం కోరుకోవాలి. తమ సమస్యలపై ఎలుగెత్తి, గొంతెత్తి ప్రశ్నించాలి. ☯

# మే డే

– ఎస్.వెంకటరమణ, పండాలపాక, నెల్లూరు




కార్మిక అన్నా ! కాలం కలిసి రాని అన్నా !!
కలసిరాని కాలం కొరకు కలలుగని
కాటికి మోసుకుపోయే వరకు
చెమట బిందువులు చిందించినా
కన్నీటి బిందువులే మిగిలాయిరా అన్నా!!!
పగలనక రేయనక కష్టపడినా నీకు
తినడానికి తిండి లేదు
కట్టుకోవడానికి బట్ట లేదు
కార్మిక చట్టాలంటారు...
కర్షకులు హక్కులంటారు...
శ్రామికుల రాజ్యం అంటారు...
నీ ఆకలి తీరేది ఎప్పుడు ?
నీ భవిత మారేదెప్పుడు ??
తెల్లవాని తుపాకీ గుండుకు గుండెను చూపి
భారతమాతను దాస్యవిముక్తి చేసిన నీకు
తప్పలేదు చీకటి బ్రతుకు
ఏ చరిత్ర నీ చెమటక ఖరీదు కట్టింది ?
ఎన్నాళ్ళు ఈ ఆకలి కేకలు ?
ఎన్నాళ్ళు ఈ చీకటి బ్రతుకులు ??
ప్రపంచ కార్మికులారా ఏకంకండి మేడే పిలుస్తుంది...
మన హక్కుల సాధనకై చేయి చేయి కలిపి
పదండి ముందుకు...
పదండి ముందుకు...

# 'మే' ఫ్లవర్



మే నెల రాగానే అరుణ కిరణాలు ప్రసరిస్తూ ఎర్రటి జెండా రెపరెపల్లా ఓ పువ్వు వికసిస్తుందంటే నమ్మశక్యమా?!.

మనం నమ్మినా? నమ్మకపోయినా? అది నిజం. ప్రకృతి ప్రదర్శించే అనేక అద్భుతాల్లో ఇదొకటి. లిల్లీ జాతికి చెందిన ఈ మొక్క సంవత్సరమంతా పొడవాటి ఆకులతో ఉంటుంది. గమ్మత్తుగా మే నెల రాగానే ఎర్రని గుండ్రని బంతుల్లాంటి పువ్వులు పూస్తుంది. అందుకే వీటిని ఫుట్బాల్ లిల్లీలు అని కూడా అంటారు. మే నెల అంతా పూసి మళ్లా ఈ మొక్క మామూలు అయిపోతుంది.

అచ్చంగా కార్మిక దినోత్సవానికి శుభాకాంక్షలు చెప్తూ కార్మిక ఐక్యత వర్ధిల్లాలి! అన్నట్టు అరుణపతాకంలా రెపరెపలాడే ఈ పూల మొక్క పిడికిళ్ళు బిగించి విప్లవ జోహార్లు అర్పిస్తున్నట్లు ఉంటుంది.

# ఛలో సిఎంఓ కేసు కొట్టివేత



2022 ఏప్రిల్ 25న యుటిఎఫ్ రాష్ట్ర సంఘం చేపట్టిన 'ఛలో సి.యం.ఓ' పిలుపు సందర్భంగా 65మంది యు.టి.యఫ్. నాయకులు, కార్యకర్తలపై పోలీసులు పెట్టిన అక్రమ కేసును 28.04.2026న కోర్టు కొట్టి వేసింది. సుమారు 4 సంIIలుగా నడచిన ఈ కేసు అక్రమమని ప్రభుత్వం గుర్తించి, కేసు ఉపసంహారించుకున్న నేపథ్యంలో యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలపై ఉన్న కేసును రద్దు చేస్తున్నట్లు విజయవాడ మూడవ అడిషనల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ప్రకటించారు.

సిపిఎస్ రద్దు కోరుతూ 2022 నుండి యుటియఫ్ అనేక ఉద్యమాలు నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎస్ ఉద్యమాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉద్యోగులపై గత రాష్ట్ర ప్రభుత్వం అనేక కేసులు బనాయించింది. అయినప్పటికీ యుటియఫ్ సభ్యులు, కార్యకర్తలు వెనకడుగు వేయకుండా నిర్భయంగా అనేక పోరాటాలు సాగించారు. ఇప్పటికే చాలా జిల్లాలలో కేసులు కొట్టివేయడం జరిగింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో పెట్టిన కేసును ఉపసంహరించుకున్నట్లు కోర్టుకు తెలపడంతో కోర్టు కేసును రద్దు చేసింది. కేసును కోర్టు రద్దు చేయడం పట్ల యుటియఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హర్షం వ్యక్తం చేసారు. ఈ తీర్పు ఉద్యమాలకు ఊపిరి పోసిందని, ఈ విజయం ప్రజాస్వామిక విజయమని పేర్కొంటూ నిర్బంధాలకు, కేసులకు సైతం వెరవకుండా సంఘ పిలుపుకు స్పందించి ఉద్యమించిన కార్యకర్తలకు, ఉపాధ్యాయులకు అందరికీ ఈ విజయాన్ని అంకితమిస్తున్నట్లు ప్రకటించారు.

ఈ సందర్భంగా కోర్టుకు యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు జీ.వి రమణ, ఎస్.పి.మనోహర్ కుమార్, తిరుపతి జిల్లా పూర్వ జిల్లా కార్యదర్శి ఓ.విజయకుమార్, ఎన్‌టిఆర్ జిల్లా ప్రధానకార్యదర్శి ఏ.సుందరయ్య, అడ్వకేట్‌లు సుస్మిత, దుర్గేష్ హాజరయ్యారు.

## జోన్‌ల వారీగా జిల్లాల విభజన

| మల్టీ-జోన్ | జోన్ | జిల్లాలు |
|---|---|---|
| మల్టీ-జోన్-I | జోన్-I | శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి |
| | జోన్-II | అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ. |
| | జోన్-III | పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్.టి.ఆర్., కృష్ణ. |

| మల్టీ-జోన్ | జోన్ | జిల్లాలు |
|---|---|---|
| మల్టీ-జోన్-II | జోన్-IV | గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు. |
| | జోన్-V | తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వై.ఎస్.ఆర్. కడప. |
| | జోన్-VI | నంద్యాల, అనంతపురము, కుర్నూలు, శ్రీ సత్యసాయి |

# కార్మికవర్గ ఐక్యతే భవిష్యత్తు




కార్మిక దినోత్సవం సందర్భంగా



కె. కమల్ కుమార్
యుటియఫ్ ఏలూరు జిల్లా కార్యదర్శి

ప్రతి సంవత్సరం మే 1వ తేదీన పండుగ వాతావరణంలో జరుపుకునే కార్మిక దినోత్సవం **మేడే అనేది కేవలం ఒక పండుగ కాదు, అది ప్రపంచ కార్మిక వర్గ చరిత్రలో రక్తంతో రాసుకున్న పోరాటానికి ప్రతీక.**

మేడే అనేది కార్మిక వర్గం చేసిన త్యాగాలు, పోరాటాలు, ఐక్యతకు ప్రతీక. 19వ శతాబ్దంలో పరిశ్రమల విస్తరణతో కార్మికులను రోజుకు 12-16 గంటలు పని చేయించేవారు, తక్కువ జీతాలు ఇచ్చేవారు, భద్రత కూడా ఉండేది కాదు. ఈ అన్యాయ పరిస్థితులకు వ్యతిరేకంగా కార్మికులు సంఘటితమై పోరాటాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో 1886 మే 4న అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన హేమార్కెట్ ఎఫైర్ ప్రపంచ కార్మిక ఉద్యమానికి మలుపు తిప్పిన సంఘటనగా నిలిచింది. రోజుకు 8 గంటల పని సమయం కోసం శాంతి యుతంగా ర్యాలీ చేస్తున్న కార్మికులపై జరిగిన హింస, ప్రపంచాన్ని కదిలించింది. ఆ పోరాటం కేవలం అమెరికాకే పరిమితం కాలేదు, ప్రపంచవ్యాప్తంగా కార్మికుల ఐక్యతకు, హక్కుల కోసం పోరాటాలకు స్ఫూర్తినిచ్చింది. **ఆనాడు చికాగో నగరంలో రక్తంతో తడిసి ఎర్రగా మారిన కార్మికుల మెడలో తువ్వాలునే కార్మిక వర్గ జెండాగా ఎగరేసి మే 1ను కార్మిక దినోత్సవంగా** ప్రకటించి ప్రతి సంవత్సరం జరుపుకోవడం ప్రారంభమైంది.

ఈ చరిత్ర మనకు ఒక ముఖ్యమైన నిజాన్ని చెబుతుంది. నేడు మనం అనుభవిస్తున్న సౌకర్యాలు, హక్కులు ఏవీ సులభంగా వచ్చినవి కావు. రోజుకు 8 గంటల పని సమయం, కనీస వేతనం, వారాంతపు సెలవులు, ఉద్యోగ భద్రత, కార్మిక చట్టాలు, భీమా వంటి అనేక హక్కులు అన్నీ కూడా నాటి కార్మిక ఉద్యమాల ఫలితమే. ఈ హక్కుల కోసం వేలాది మంది కార్మికులు జైలుకెళ్లారు, కొందరు ప్రాణాలు కోల్పోయారు. కాబట్టి మేడే అనేది కేవలం ఒక జ్ఞాపక దినం కాదు, అది పోరాటం ద్వారా సాధించిన హక్కులను గుర్తు చేసే రోజు. అదే సమయంలో, ఈ హక్కులను కాపాడుకోవడానికి కూడా నిరంతర ఉద్యమాలు అవసరమనే సందేశాన్ని, **హక్కులు ఒకరు ఇచ్చేవి కావు, మనం పోరాడి సాధించుకోవాల్సినవి అనే నినాదాన్ని మే డే మనకు అందిస్తుంది.**

కార్మిక వర్గ దృక్పథంలో సమాజం వర్గాలుగా విభజించబడింది. ఈ విశ్లేషణకు పునాది వేసినవారు కారల్ మార్క్స్ మరియు ఫ్రెడరిక్ ఏంగెల్స్. వారి ప్రకారం మూలధనవాద వ్యవస్థలో కార్మికుడు తన శ్రమను అమ్ముకునే వాడిగా మారిపోతాడు, కానీ అతని శ్రమ ద్వారా సృష్టించిన సంపదను యజమాని స్వాధీనం చేసుకుంటాడు. దీనినే వారు సర్ప్లస్ వాల్యూ అని వివరించారు.

ఈ దోపిడీని ఎదుర్కోవడానికి కార్మిక ఉద్యమాలు తప్పనిసరిగా పోరాడాలి. వ్యక్తిగతంగా కార్మికుడు బలహీనుడు. కానీ సంఘటిత శక్తిగా మారినప్పుడు అతను సామాజిక మార్పుకు మూలంగా మారగలడు. అలా మారిన సంఘటనలు ప్రపంచ చరిత్రలో కోకొల్లలు. యూనియన్లు, సమ్మెలు, ర్యాలీలు, నిరసనలు, దీక్షలు ఇవన్నీ కేవలం నిరసన పద్ధతులు మాత్రమే కాదు, ఇవి వర్గ పోరాటానికి ఆయుధాలు.

ప్రస్తుతం భారతదేశంలో అమలవుతున్న అనేక విధానాలు కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ఉన్నాయి. ముఖ్యంగా లిబరలైజేషన్, ప్రైవేటీకరణ, గ్లోబలైజేషన్ (LPG policies) పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ చేతుల్లోకి అప్పగించడం వల్ల ఉద్యోగ భద్రత తగ్గిపోయింది.

కొత్తగా అమలు చేస్తున్న లేబర్ కోడ్స్ (Labour Codes) కార్మిక హక్కులను మరింత బలహీనపరుస్తున్నాయి. పని గంటలను పెంచే అవకాశాలు, సమ్మెలపై పరిమితులు, కాంట్రాక్ట్ వ్యవస్థను ప్రోత్సహించడం వంటి అంశాలు కార్మికులపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఇప్పటికే మన రాష్ట్రంలో పని గంటలు పెంపు చట్టం చేసేసారు.

**కాంట్రాక్ట్ ఉద్యోగాలు పెరగడం వల్ల స్థిర ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి. "Hire and Fire" విధానం ద్వారా కార్మికులను ఎప్పుడైనా తొలగించే పరిస్థితి ఏర్పడింది. ఇది కార్మికుల జీవన భద్రతను దెబ్బతీస్తోంది.**

అలాగే కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు ఇస్తూ, కార్మికుల సంక్షేమంపై ఖర్చు తగ్గించడం కూడా ఒక ప్రధాన సమస్య. ఇది వర్గ అసమానతలను మరింత పెంచుతోంది. ప్రస్తుతం అమలవుతున్న విధానాలలో "అభివృద్ధి" అనే పేరుతో కార్మికుల హక్కులను క్రమంగా తగ్గించే ప్రయత్నం జరుగుతోంది. పెద్ద ప్రాజెక్టులు, కార్పొరేట్ పెట్టుబడులు వస్తున్నప్పటికీ, వాటి ఫలితాలు కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కనిపించడం లేదు. **అభివృద్ధి అంటే కేవలం లాభాలు కాదు, ప్రతి కార్మికుడి జీవితం, జీవన ప్రమాణం మెరుగుపడినప్పుడే అది నిజమైన అభివృద్ధి అవుతుంది.**

నేటి కాలంలో కార్మిక వర్గ స్వరూపం కూడా మారుతోంది. సంప్రదాయ పరిశ్రమలతో పాటు ఐటీ, గిగ్ ఎకానమీ, డెలివరీ రంగాల్లో పనిచేసే యువత కూడా కార్మిక వర్గంలో భాగమవుతున్నారు. స్విగ్గీ, జొమాటో, ఉబెర్, ఓలా, రాపిడో వంటి ప్లాట్‌ఫామ్‌లలో

పని చేసే వారు "పార్ట్‌నర్స్" అనే పేరుతో పిలవబడుతున్నప్పటికీ, వారికి కనీస వేతనం, భద్రత, ఉద్యోగ హక్కులు పూర్తిగా లభించడం లేదు. ఇది ఆధునిక రూపంలో జరుగుతున్న కార్మిక వర్గ దోపిడీకి ఉదాహరణ.

**ప్రతి కార్మికుడి వెనుక ఒక కుటుంబం ఉంటుంది. వారి ఆశలు, అవసరాలు, భవిష్యత్తు అన్నీ ఆ ఒక్క ఉద్యోగంపైనే ఆధారపడి ఉంటుంది. ఉద్యోగ భద్రత లేకపోవడం అంటే కేవలం ఒక వ్యక్తి సమస్య కాదు, అది ఒక కుటుంబం మొత్తం భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తుంది.**

ఉద్యమాలు బలహీనపడినప్పుడు ప్రభుత్వం మరియు కార్పొరేట్ శక్తులు మరింత దూకుడుగా కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తాయి. హక్కులు క్రమంగా తగ్గిపోతాయి. సమానత్వం కూలిపోతుంది.

కార్మిక ఉద్యమాలు బలహీనపడితే దాని ప్రభావం కేవలం ఫ్యాక్టరీలకే పరిమితం కాదు. సమాజంలోని అన్ని వర్గాలపై దాని ప్రభావం ఉంటుంది. ముఖ్యంగా మధ్యతరగతి ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కూడా దీని ప్రభావానికి లోనవుతారు.

**కార్మిక ఉద్యమాలు మరియు ఉపాధ్యాయ ఉద్యమాలకు అవినాభావ సంబంధం ఎప్పుడూ ఉంది.** చాలామంది భావించేలా ఉపాధ్యాయులు కార్మిక వర్గానికి భిన్నమైన వారు కాదు. వారు కూడా తమ మేథో శ్రమను అమ్ముకునే వేతన జీవులు. **కాబట్టి వారు కూడా కార్మిక వర్గంలో భాగమే. కార్మిక ఉద్యమాలు బలంగా ఉన్నప్పుడే ఉపాధ్యాయులకు కూడా అనేక ప్రయోజనాలు ఉంటాయి అనే విషయం ఉపాధ్యాయులు గ్రహించాలి.**

ప్రస్తుతం ఉపాధ్యాయ రంగంలో స్థిర ఉద్యోగాలు, సముచిత వేతనాలు, పెన్షన్ సదుపాయాలు, ఉద్యోగ భద్రత ఉన్నాయి.

**కానీ, ఉద్యమాలు బలహీనపడితే పరిస్థితి మారుతుంది. కాంట్రాక్ట్ టీచర్లు పెరుగుతారు. తక్కువ జీతాలతో పని చేయాల్సి వస్తుంది. ప్రైవేటీకరణ వల్ల ప్రభుత్వ పాఠశాలలు మూసివేయబడే ప్రమాదం ఉంటుంది.**

ఇటీవల విద్యారంగంలో జరుగుతున్న ప్రైవేటీకరణ చర్యలు కూడా ఉపాధ్యాయుల స్థితిని దెబ్బతీస్తున్నాయి. విద్యను ఒక సేవగా కాకుండా వ్యాపారంగా మార్చడం వల్ల ఉపాధ్యాయుల పాత్ర కూడా మారిపోతోంది.

**ఈ నేపథ్యంలో ఉద్యమాలు నిరంతరం అవసరం అనే ఒక స్పష్టమైన సందేశం ప్రతి కార్మికునికి, ఉపాధ్యాయునికి చేరాలి.**

అయితే నేటి పరిస్థితులు చూస్తే మనం సాధించుకున్న హక్కులు ఇంకా ప్రమాదంలోనే ఉన్నాయని తెలుస్తోంది. ఇటీవల నోయిడా వంటి పరిశ్రమ ప్రాంతాల్లో కార్మికులు భారీగా నిరసనలు వ్యక్తం చేసిన సంఘటనలు కనిపిస్తున్నాయి. తక్కువ వేతనాలు, ఎక్కువ పని ఒత్తిడి, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి సమస్యలతో ఆగ్రహించిన కార్మికులు రోడ్లపైకి వచ్చారు. కొన్ని చోట్ల వాహనాల ధ్వంసం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇది కార్మికులలో పేరుకుపోయిన ఆవేదన, నిరాశ, ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ప్రతిబింబం.

ఈ సంఘటనలు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి, కార్మికుల సమస్యలను పట్టించుకోకపోతే పరిస్థితులు తీవ్రరూపం దాల్చుతాయి. కాబట్టి మేడే మనకు కేవలం గత పోరాటాలను గుర్తు చేయడం మాత్రమే కాదు, నేటి పరిస్థితుల్లో కూడా కార్మిక ఉద్యమాలు ఎంత అవసరమో గుర్తుచేస్తుంది. హక్కులు ఒకసారి సాధించాక శాశ్వతంగా ఉండవు, వాటిని కాపాడుకోవడానికి నిరంతర పోరాటం అవసరం అని తెలియజేస్తుంది. **కార్మిక చట్టాలను రద్దు చేయడం ద్వారా కార్మిక ఉద్యమాలు నిర్బంధించవచ్చు అన్న ప్రభుత్వ నిర్ణయం చెల్లదని నోయిడా కార్మికుల పోరాటం తెలియజేస్తుంది. అణచివేత అధికమైన ప్రతిసారీ తిరుగుబాటు మరింత తీవ్రం అవుతుంది అనే నిజాన్ని పాలకులు గుర్తెరగాలి.**

ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికులు మళ్లీ సంఘటిత మవ్వాలి. ట్రేడ్ యూనియన్లను బలోపేతం చేయాలి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులు అందరూ కలిసి సామూహిక ఉద్యమాలు చేపట్టాలి. ఈ రోజుల్లో యువతలో పెద్ద భాగం కాంట్రాక్ట్ ఉద్యోగాలు, తాత్కాలిక పనుల్లో కొనసాగుతోంది. ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల భవిష్యత్తుపై అనిశ్చితి పెరుగుతోంది. ఈ యువత ఉద్యమాలకు దూరంగా ఉంటే రేపటి రోజుల్లో హక్కులు మరింత క్షీణించే ప్రమాదం ఉంది. కాబట్టి యువత ఉద్యమాలలో భాగస్వామ్యం కావడం అత్యంత అవసరం.

**యువత ఉద్యమాల్లో భాగస్వామ్యం అవుతూ కార్మిక ఉద్యమాలలో కొత్త మార్గాలను అన్వేషించాలి. కేవలం సంప్రదాయ పద్ధతులకే పరిమితం కాకుండా, డిజిటల్ వేదికల ద్వారా ఐక్యతను పెంపొందించాలి.** దోపిడీకి గురి అయ్యే ప్రతి ఒక్కరినీ ఉద్యమాల్లో భాగస్వామ్యం చేయాలి. సామాజిక మాధ్యమాలు, సాంకేతికతను ఉపయోగించి కార్మిక హక్కుల కోసం పోరాటాన్ని విస్తరించాలి. ఐక్యత మారితే పోరాట పద్ధతులు మారాలి కానీ, పోరాట లక్ష్యం, సమానత్వం మరియు న్యాయం మాత్రం మారకూడదు.

ఇప్పటికీ మేడే మనకు గుర్తు చేసే కర్తవ్యం **పోరాటం ఆగకూడదు. వర్గ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. కార్మిక వర్గం ఐక్యంగా నిలిస్తేనే సమానత్వం సాధ్యం అని.**

అందుకే దాదాపు **180** ఏళ్ల క్రితం కమ్యూనిస్ట్ మేనిఫెస్టోలో **మార్క్స్ చెప్పిన "ప్రపంచ కార్మికులారా, ఏకమవ్వండి!"** అనే నినాదం నేటికీ ఆచరణ యోగ్యం.

**ప్రపంచ చరిత్ర చెబుతున్న ఒక సత్యం ఏమిటంటే, ఎక్కడైతే కార్మిక వర్గం ఐక్యంగా నిలుస్తుందో అక్కడే మార్పు సాధ్యమవుతుంది. విభజన, భయం, అసంఘటిత పరిస్థితులు పాలక వర్గానికి లాభం చేకూరుస్తాయి. కాబట్టి కులం, మతం, ప్రాంతం అనే భేదాలను దాటి కార్మికులు ఒకే వేదికపైకి రావాలి. అదే నిజమైన మేడే స్ఫూర్తి.**

మనం మౌనం పాటిస్తే చరిత్ర మళ్లీ పునరావృతమవుతుంది. హక్కులు ఒక్కొక్కటిగా మన చేతుల నుంచి జారిపోతాయి. కానీ, మనం ప్రశ్నిస్తే, పోరాడితే, ఐక్యంగా నిలిస్తే మార్పు తప్పకుండా సాధ్యమే. పోరాటం ఎప్పుడూ వృథా కాలేదు, ఇకపైన కూడా కాబోదు. అనేది అక్షర సత్యం

**కార్మిక ఉద్యమాలు బలంగా ఉంటేనే సమాజం న్యాయంగా ఉంటుంది. లేకపోతే దోపిడీ మరింత పెరుగుతుంది. కాబట్టి మేడే అనేది కేవలం ఒక రోజు కాదు అది ఒక పోరాట పిలుపు.**




84యేళ్ళ వయసులో కూడా నిరాడంబరంగా, నిశ్శబ్దంగా ప్రతిరోజూ పొద్దున్నే 10.00 గంటలలోపు టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయానికి వచ్చి మేనేజర్ సీట్లో కూర్చుని పని చేసుకుంటూ, తన భోజనం తానే తెచ్చుకుని, 5.00 గంటల వరకు ... అవసరమైతే ఆ తర్వాత కూడా పని చేసుకుని ఇంటికి వెళ్తున్న బక్క పల్చటి పెద్ద మనిషిని చూసి.. ఆయన గురించి తెలియనివారు ఏంటో పాపం ఈ వయసులో కూడా కష్టపడుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయేమో అని అపోహపడడం సహజం.

కానీ 60యేళ్ళ ఉద్యమ ప్రస్థానానికి కొనసాగింపుగా స్వచ్ఛందంగా సేవ చేస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యపోవడమేకాదు, అభినందించకుండా ఉండలేరు. ఆయనే కామ్రేడ్ **డి మస్తాన్ రావు**గారు. అమరజీవి రామిరెడ్డి గారికి అత్యంత ఆత్మీయుడు. విరవు బాలసుబ్రహ్మణ్యం (విబిఎస్) గారి అనుంగు సహచరుడు, కా. దత్తు గారికి ఆప్త మిత్రుడు అయిన కామ్రేడ్ మస్తాన్‌రావుగారి నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకం.

అకౌంట్స్ వ్రాయడం, ఆర్థిక నివేదిక తయారు చేయడం, అధ్యాపకదర్శిని కోసం ప్రభుత్వ ఉత్తర్వులను కూర్పు చేయడం, ఏదైనా ఉత్తర్వు కావాలని కార్యాలయానికి వచ్చిన వారికి పాత జిఒలను వెతికి పెట్టడం, కంప్యూటర్ ముందు కూర్చుని ఆన్‌లైన్ సభ్యత్వాలను విశ్లేషించడం, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రికలో ప్రచురించే అంశాల ప్రూఫ్ రీడింగ్....ఇలా ఏ పనైనా ఓపికగా చేసుకుంటూ పోతారు. ఈ వయసులో ఇంత ఓపిక ఎక్కడినుండి వచ్చిందని అడిగితే చిరునవ్వులు చిందిస్తూ యుటిఎఫ్‌లో పని చేయడమే నా ఆరోగ్య రహస్యం అంటారు. ఉద్యమంలో మీ అనుభవాలను చెప్పండి పత్రికలో వేద్దామని పలుమార్లు అడిగినా వద్దులేబ్బా... ప్రచారం ఇష్టం లేదంటూ సున్నితంగా తిరస్కరించారు. ఇటీవల కొన్ని గంటల పాటు కారులో ప్రయాణిస్తున్న సమయంలో మాటల్లోకి దించి రాబట్టిన విషయాలను ఇంటర్వ్యూ రూపంలో అక్షరబద్ధం చేశాము.

**మీ మొదటి నియామకం ఎప్పుడు, ఎక్కడ చెప్పండి.**

**మస్తాన్ రావు:** మా ఊరు ప్రకాశం జిల్లాలోని గంగవరం. నేను మెట్రిక్యులేషన్, టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసిన తర్వాత 1962లో స్థానిక ఎయిడెడ్ స్కూల్‌లో క్లర్కుగా చేరాను. 1965లో వివాహం అయింది. 1966లో నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డిపేట సమితి తాండూరు గ్రామంలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా అపాయింట్‌మెంట్ పొంది ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరాను. ముల్కీ నిబంధనల కారణంగా 1969లో నెల్లూరుకు బదిలీ అయ్యాను. ఇలా బదిలీ అయిన 60మందికి సూపర్ న్యూమరరీ పోస్టులు కేటాయించి, జిల్లా పరిషత్ యాజమాన్యంలో 11 కొత్త పాఠశాలలు ప్రారంభించారు. నన్ను మారుమూల కుగ్రామంలోని పాఠశాలకు కేటాయించారు. రవాణా, కమ్యూనికేషన్ లేదు. నేను అక్కడే నివాసం ఉండేవాణ్ణి ప్రసవం సమయంలో నా భార్య చనిపోతే టెలిగ్రాం అందుకుని ఇంటికి రావటానికి ఐదు రోజులు పట్టింది. రెండేళ్ళ తర్వాత నెల్లూరు సమీపంలోని.....పాఠశాలకు బదిలీ చేశారు. అప్పటి నుండి 2000 సం॥లో రిటైర్ అయ్యేవరకు నెల్లూరు జిల్లాలోనే పని చేశాను. నా సర్వీసు అంతా హైస్కూళ్ళలోనే సెకండరీ గ్రేడ్ టీచర్ గా గడిచింది. రిటైరైన తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడ్డాను.

**అయ్యో...భార్య మరణం ఎలా జరిగింది? కుటుంబం వివరాలు చెప్పండి.**

**మస్తాన్ రావు:** మొదటి కాన్పులో బాబు. సిజేరియన్ జరిగింది. రెండో కాన్పు సమయంలో సిజేరియన్ చేయాల్సి వుంది కానీ సహజ ప్రసవం కోసం డాక్టర్ ప్రయత్నించి విఫలం కావడంతో తల్లీ, బిడ్డ ప్రాణాలు కోల్పోయారు. మా బాబు ఆలనా, పాలన మా అక్క, మేనకోడలు చూసుకున్నారు. తదుపరి మా మేనకోడలిని వివాహం చేసుకున్నాను. మాకు ఇంకో బాబు పుట్టాడు. ఇద్దరు అబ్బాయిలు ఉన్నత చదువులతో ఉద్యోగాలు పొంది హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

**మీరు యుటిఎఫ్ ఉద్యమంలోకి ఎలా వచ్చారు?**

**మస్తాన్ రావు:** మా గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ బలంగా ఉండేది. మొదటి నుండి అభ్యుదయ భావాలతో పెరిగాను. నిజామాబాద్ జిల్లాలో పనిచేసినప్పుడు ఎస్‌టియులో చేరాను. నెల్లూరు జిల్లాకు బదిలీ అయిన తరువాత ఏ సంఘంలో చేరలేదు. అక్కడ ఎపిటిఎఫ్ బలంగా ఉండేది. కానీ మా పోస్టింగ్ సమయంలో ఆ సంఘం అగ్రనేత మాటలు మమ్మల్ని బాధించాయి. అందుకే ఆ సంఘంలో చేరలేదు. యుటిఎఫ్ ఆవిర్భావం తర్వాత 1974లో యుటిఎఫ్‌లో చేరాను. కొండాచారితో పరిచయం ఏర్పడింది. 1978లో కోవూరు సమితి కార్యదర్శిగా ఎన్నికయ్యాను. 1982లో రామిరెడ్డి గారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ సమితి అంతా తిరిగి ప్రచారం చేశాను. ఆ సమయంలోనే రామిరెడ్డి గారు పరిచయం అయ్యారు. రామిరెడ్డి గారు ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ఆయన కోరిక మేరకే నెల్లూరు జిల్లా యుటిఎఫ్ ఆఫీసుకి మకాం మార్చాను. జిల్లా కోశాధికారిగా సుదీర్ఘకాలం పని చేశాను. నేను విబిఎస్ (వి.బాలసుబ్రమాణ్యం) ఒత్తిడి మేరకు ఒక సంవత్సరం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించాను.

**జిల్లా ఉద్యమంలో మీరు చేసిన ముఖ్యమైన పోరాటాలు, అనుభవాలు వివరించండి.**

**మస్తాన్ రావు:** అవినీతికి వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటాలు చేశాము. లోకల్ ఫండ్ (ప్రస్తుత స్టేట్ ఆడిట్) కార్యాలయంలో ఎస్.ఆర్.కి ఇంత అని రేటు నిర్ణయించి లంచం ఇస్తేనే పిఆర్‌సి బిల్స్ ప్రీ ఆడిట్ చేసేవారు. దానికి వ్యతిరేకంగా కటారి తిరుపాలు నేతృత్వంలో పెద్ద పోరాటం చేసి ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా అన్ని బిల్లులు పాస్ చేయించాము. ఆ తర్వాత యుటిఎఫ్ ప్రాతినిధ్యం చేసిన ఏ ఒక్క బిల్లును లంచం కోసం ఆపలేదు.

1997లో బదిలీల్లో జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ నాగభూషణమ్మ అవినీతికి పాల్పడి చేసిన అక్రమ బదిలీలకు వ్యతిరేకంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఉద్యమం జరిగింది. ఆ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం డిఎస్ఈ డాక్టర్ రెడ్డి సుబ్రమణ్యం గారిని విచారణాధికారి గా నియమించింది. కొండాచారి, నేను అక్రమ బదిలీల చిట్టా సేకరించగా, రామిరెడ్డిగారి సమక్షంలో విబిఎస్ డైరెక్టర్‌కు సాక్ష్య ధారాలతో సమర్థవంతంగా వివరించారు. రామిరెడ్డిగారి సూచన మేరకే బదిలీల్లో పారదర్శకత కోసం కౌన్సిలింగ్ విధానాన్ని రామిరెడ్డి, సుబ్రమణ్యంగారు ప్రతిపాదించారు. రాష్ట్ర ప్రభుత్వం 1998 నుండి అమలులోకి తెచ్చింది.

**మీరు చదివింది మెట్రిక్యులేషన్, పని చేసింది సెకండరీ గ్రేడ్ టీచర్ గా మరి జిఒలు, నియమ నిబంధనలపైన అవగాహన ఎలా కలిగింది?**

**మస్తాన్ రావు:** నెల్లూరు జిల్లా కార్యాలయంలో నివాసం ఉంటున్నప్పుడు చాలామంది ఉపాధ్యాయులు తమ సమస్యలను, సందేహాలను ఉత్తరాల ద్వారా కార్యాలయానికి తెలియజేసేవారు. వాటిని తీసుకుని కొండాచారిగారి ఇంటికి వెళ్ళి సమాధానాలు తెలుసుకుని ప్రత్యుత్తరాలు వ్రాసేవాడిని. ఒకసారి రామిరెడ్డి గారు జిల్లా ఆఫీసులో మకాం చేశారు. ఆ సమయంలో నేను ఉత్తరాలు తీసుకుని కొండాచారి ఇంటికి పోవడానికి సిద్ధపడుతుంటే ఆయన ఆపి ఒక్కొక్క ఉత్తరం నాతో చదివించి...దానికి సంబంధించిన జిఒ ఫలానా పుస్తకంలో ఉంటుంది. ఇండెక్స్‌లో చూడమని చెప్పి నాతోనే సమాధానాలు రాయించారు. ఇకనుంచి నువ్వే చదివి రాయాలి. ఇంకెప్పుడైనా ఉత్తరాలు పట్టుకుని కొండాచారి ఇంటికి పోయావంటే ఊరుకోను అన్నారు. అప్పటి నుండి నేనే జిఒలు అధ్యయనం చేయటం అలవాటు చేసుకున్నాను.

**రాష్ట్ర కార్యాలయం బాధ్యతల్లోకి ఎప్పుడు వచ్చారు?**

**మస్తాన్ రావు:** 2000 సం॥లో రిటైరైన తరువాత హైదరాబాద్‌కు మకాం మార్చాను. రామిరెడ్డి గారి కోరిక మేరకు రాష్ట్ర కార్యాలయం మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టాను. పత్రికా కార్యాలయం బాధ్యత కూడా చూశాను. 2005లో రిలీవయ్యాను. 2007లో యుటిఎఫ్ మద్దతుతో రామిరెడ్డి గారు, చుక్కా రామయ్య గారు, విబిఎస్, కెఎస్ లక్ష్మణ రావు, డాక్టర్ కె నాగేశ్వర్, ఎంవిఎస్ శర్మ, కె జార్జి విక్టర్ (ఏడుగురు) ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. చుక్కా రామయ్య చైర్మన్ గా, రామిరెడ్డి కన్వీనర్‌గా పిడిఎఫ్ గ్రూపును ఏర్పాటు చేశారు. రామిరెడ్డిగారి క్వార్టర్స్‌నే పిడిఎఫ్ ఆఫీసుగా పెట్టుకున్నారు. నన్ను మేనేజరుగా ఉండాలని ఆదేశించారు. రాష్ట్రం విడిపోయేవరకు ఆ బాధ్యతలు చూశాను. తదుపరి కూడా విబిఎస్ కోరిక మేరకు రెండేళ్ళ క్రితం వరకు హైదరాబాదులో ఉంటూనే అవసరమైనప్పుడు విజయవాడ వెళ్తూ అక్కడ పిడిఎఫ్ కార్యాలయం నిర్వహణ బాధ్యతలు చూశాను. ఏ బాధ్యతల్లో ఉన్నా అధ్యాపకదర్శిని జిఒల కూర్పులో పనికి సహకరించాను. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత టిఎస్ యుటిఎఫ్ కార్యాలయంలో పనిచేస్తున్నాను. మేనేజర్‌గా ఎవరున్నా వారిని గైడ్ చేయడం, వారికి పనిలో సహాయపడటం చేస్తున్నాను. ప్రస్తుతం యునైటెడ్ టీచర్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, పెద్ద అంబర్‌పేట ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. ఇటీవలే రామిరెడ్డి గారి జ్ఞాపకార్థం యుటిఎఫ్ కాలనీకి ముఖద్వారం (ఆర్చిని) కూడా నిర్మించాము. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (TAPRPA) రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాను.

**ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు కదా...మేజర్ సర్జరీ అయినా నెల తిరక్కుండానే టిఎస్ యుటిఎఫ్ ఆఫీసు పనిలోకి వచ్చారు ఇబ్బందిగా లేదా?**

**మస్తాన్ రావు:** ఇంట్లో ఉంటే ఏమీ తోచక ఇబ్బందిగా ఉంటుంది. ఆఫీసు పనిలో ఉంటేనే నలుగురితో కలవడం, కాలక్షేపం అవుతుంది. గతంలో బైపాస్ సర్జరీ అయింది. ఒకసారి యాక్సిడెంట్ అయింది. ఇటీవల పొట్టకు ఆపరేషన్ చేసి చిన్న పేగు కట్ చేశారు. కుటుంబ సభ్యులతో పాటు సంఘ నాయకులు, కార్యకర్తలు ఇచ్చిన నైతిక మద్దతుతోనే అనారోగ్య సమస్యలన్నింటినీ అధిగమించ గలిగాను. అనారోగ్యం అని బాధపడుతూ కూర్చుంటే ఏ పనీ చేయలేం. ఆరోగ్యం మరింత క్షీణించే ప్రమాదం ఉంది. తగిన జాగ్రత్తలు పాటిస్తూ పనిలో ఉంటే ఆరోగ్యంగా ఉంటాము. ఓపిక ఉన్నంత వరకు సంఘానికి సహాయపడాలనేదే నా కోరిక.

**ఉపాధ్యాయ ఉద్యమంలో అప్పటికీ, ఇప్పటికీ మీరు గమనించిన మార్పులు ఏమిటి?**

**మస్తాన్ రావు:** కమ్యూనికేషన్ పెరిగింది. టెక్నాలజీ వినియోగం పెరిగింది. ఉపాధ్యాయుల సంఖ్య పెరిగింది. కానీ కమిట్‌మెంట్ తగ్గుతున్నది. పాలకుల విధానాలే దీనికి కారణం. ప్రధానంగా రూ. 398 స్పెషల్ టీచర్ వ్యవస్థ, అప్రెంటీస్ విధానం, పాత పెన్షన్ విధానం రద్దు తదితర అంశాలు ఉపాధ్యాయుల్లో అశాంతికి కారణం. సంఘాలుగా వాటిపై పోరాటాలు చేస్తున్నా ఆ,యా ఉపాధ్యాయుల భాగస్వామ్యం తక్కువగా ఉంటున్నది. సమస్యలు, క్యాడర్ల వారీ సంఘాలతో ఐక్యత దెబ్బతిని ఉపాధ్యాయ ఉద్యమం బలహీన పడుతోంది. కొందరు యుటిఎఫ్ కార్యకర్తల్లో సైతం నిబద్ధత, క్రమశిక్షణ కొరవడడం బాధ కలిగిస్తుంది.

**నేటి తరం ఉపాధ్యాయులకు మీరిచ్చే సందేశం ఏమిటి?**

**మస్తాన్ రావు:** ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి. ఉపాధ్యాయ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనాలి. సంఘాల పోరాటాలతో సాధించుకున్న సౌకర్యాలను నిలబెట్టుకోవాలి. ఎందరో నాయకులు, కార్యకర్తల త్యాగాలతో నిర్మించుకున్న ఉపాధ్యాయ ఉద్యమాన్ని రక్షించుకోవాలి.

సమస్యల పట్ల అవగాహన పెంచుకోవాలి. నిబంధనావళిపట్ల నిక్కచ్చిగా ఉండాలి. ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. ప్రచార ఆర్భాటాలకంటే నిర్మాణం పట్ల శ్రద్ధవహించాలి.




నియోజకవర్గ స్థాయిలో మార్చి 24, జిల్లా స్థాయిలలో ఏప్రియల్ 1న రణభేరి కార్యక్రమాలు అత్యంత విజయవంతంగా నిర్వహించారు. 12వ పిఆర్.సి. చైర్మన్ నియామకం, పెండింగ్ డిఏల విడుదల, ఆర్థిక బకాయిల సాధన కోసం ఈ ఉద్యమాన్ని చేపడుతున్నామని, ప్రభుత్వం స్పందించకుంటే ఏప్రిల్ నెలలో సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు.

## శ్రీకాకుళం

**పలాస :** పలాస తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో పలాస నియోజకవర్గ యుటిఎఫ్ 3.0 కార్యక్రమంలో భాగంగా మార్చి 24న నిరాహార దీక్షను చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ వి.గిరిబాబుకు వినతిపత్రాన్ని అందజేశారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు, కింతలి సుజాత, సిహెచ్. సుగుణ, గొల్వే మీనాక్షి, ఎన్. జయంతి, బి. రామతులసి, రాజ్యలక్ష్మి, పద్మావతి, వందన, హేమలతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ సంఘ బోర్డు డైరెక్టర్ గుంట కోదండరావు, జిల్లా కార్యదర్శి కంచరాన రమేష్, జిల్లా కార్యదర్శి జయరామ్ మాలి, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్. వెంకటాచలం, పూర్వ జిల్లా కార్యదర్శి గున్న రమేష్, పలాస, వజ్రపుకొత్తూరు, మందస, మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

**ఆమదాలవలస:** యుటిఎఫ్ నాయకులు గొంటి గిరిధర్, బొడ్డేపల్లి జనార్ధనరావు, కింతలి చంద్రరావు, సామంతుల ధనుంజయరావు, తమ్మినేని పాపారావు, పైలా అప్పలనాయుడు, సిహెచ్.వి.ఎస్.మూర్తి, గొర్లె రమేష్ కుమార్, సైలాడ రమేష్ కుమార్, డి.రాంబాబు, బొడ్డేపల్లి మోహనరావు పాల్గొన్నారు. టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్, ఎస్టియు మండల కార్యదర్శులు దీక్షా శిబిరాన్ని సందర్శించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

**టెక్కలి:** యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కురమాన దాలయ్య, జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. తవిటమ్మ, జి.నారాయణరావు, డి.గణపతిరావు, డొంకాన పాపారావు, పాలవలస ధర్మారావు, డి. లక్ష్మీనారాయణ, తమ్మినేని వైకుంఠరావు, రోణంకి విజయకుమార్, జి.మోహనరావు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం:** ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కార్యదర్శి మురళీప్రకాశ్, మండల అధ్యక్షులు జి.శ్రీనివాస్ సాహు, వి.చంటి బాబు, కవిటి మండల అధ్యక్షులు జి.జానకిరావు, సోంపేట మండల అధ్యక్షులు జి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

**01.04.2026న**

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, జెఎసి జిల్లా చైర్మన్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, జెఎసి సెక్రటరీ జనరల్, ఎన్‌జిఓ నాయకులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు, యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శులు గొంటి గిరిధర్, బొడ్డేపల్లి మోహనరావు, జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, ఎండ ఉమాశంకర్, జిల్లా కోశాధికారి పి.సూర్యప్రకాష్, జిల్లా గౌరవాధ్యక్షులు కోరాడ వైకుంఠరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బి. తవిటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విజయనగరం

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్, యుటియఫ్ రాష్ట్ర అధ్యయన కమిటీ సభ్యులు డి.రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎ.సత్య శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఎం రఘునాధరాజు, జె.వి.ఆర్.కె.ఈశ్వరరావు, నాయకులు గొర్లె పద్మ, జి. నిర్మల, డి.భూపతి, చింతారామకృష్ణతో పాటు నాలుగు మండలాల యుటియఫ్ అధ్యక్షులు, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**నెల్లిమర్లలో** యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాథ్, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మద్దిల సత్యనారాయణ, గొర్లె మధు, జిల్లా కార్యదర్శి సూర్యారావు, ఎపిఎన్ జిఒ జిల్లా ఉపాధ్యక్షులు, ఎఎన్ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎపిజిఈఎ నెల్లిమర్ల తాలూకా అధ్యక్షుడు, ఎపిఎన్‌జిఓ తాలూకా కార్యదర్శి, యుటిఎఫ్ మండల నాయకులు యస్ చలపతిరావు, బి రామారావు తదితరులు మద్దతు తెలిపారు.

**గజపతినగరంలో** యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు చింత భాస్కరరావు, రిటైర్డ్ యుటిఎఫ్ నాయకులు పంటల లక్ష్మణ, వరద అప్పలరాజు, మండల కోశాధికారి సిహెచ్ తిరుపతినాయుడు, జిల్లా కార్యదర్శులు అల్లు శంకర్రావు, పూడి మహేష్, జిల్లా కమిటీ కన్వీనర్ కె.అప్పారావు, నాలుగు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారుకి వినతిపత్రం అందజేశారు.

**బొబ్బిలి:** జిల్లా సహాధ్యక్షులు వి. ప్రసన్నకుమార్, ఎపిజెఎసి నాయకులు, యుటిఎఫ్ సీనియర్ నాయకురాలు కె. విజయగౌరి, ఎపిఎన్‌జిఓ నాయకులు, ఉప ఖజానా అధికారి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు తదితరులు మద్దతు తెలిపారు. దీక్షల్లో యుటిఎఫ్ నాయకులు కస్తూరి, కేశవరావు, శంకరరావు, బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**శృంగవరపుకోట :** యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వెంకట్రావు, జిల్లా కార్యదర్శులు జివి రమణ, రాజారావు, రాము, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట నాయుడు, ఎస్ కోట మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎంవిఎవిఎస్ నారాయణ, ఎ.రాము, సహాధ్యక్షులు ఎ. శ్రీనివాస్, జామి, ఎల్.కోట, వేపాడ, కొత్తవలస మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**రాజాం:** యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, జిల్లా కార్యదర్శి పక్కి వాసు, రాష్ట్ర కౌన్సిలర్ చుక్క వెంకుంఠరావు, నాయకులు గిరడ చంద్రశేఖర్ నాయుడు, గేదెల రమేష్, ఎ.వెంకటలనాయుడు, నాయకులు కృష్ణమ్మ, నారాయణరావు, సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

**01.04.2026న**

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ భాస్కరరావు, ప్రధానకార్యదర్శి కె.శ్రీనివాస రావు, సహాధ్యక్షులు జి.పార్వతి, కోశాధికారి సిహెచ్ తిరుపతి నాయుడు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమేష్ చంద్రపట్నాయక్, యుటిఎఫ్ కుటుంబ సంక్షేమబోర్డు సభ్యులు జెవిఆర్‌కె ఈశ్వరరావు, సీనియర్ నాయకులు డి.రాము, కె. విజయగౌరి, జిల్లా కార్యదర్శులు కె.శ్రీదేవి, ఎన్. సత్యనారాయణ, ఎస్.వెంకట్రావు, కిల్లాడ అప్పారావు, గంట సుశీల, నిర్మల, శశికళ, మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## పార్వతీపురం

**కురుపాం:** యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్, జిల్లా కార్యదర్శి ఎన్. శ్రీరాములు, కురుపాం, జి.ఎల్.పురం, జియ్యమ్మవలస మండలాలకు చెందిన ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

**పాలకొండ** యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.కృష్ణారావు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు, జిల్లా కార్యదర్శి పైడ్రాజు, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శులు విశాలాక్షి, ప్రమీల, మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు పడాల కాంతారావు, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు మహేష్, రాజ్‌కుమార్ ఉన్నారు.

**సాలూరు:** యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు పి.మధు, జిల్లా కార్యదర్శులు బి. రామకృష్ణ, కె.జానకీరావు, సీనియర్ నాయకులు బి. విజయకుమార్, సాలూరు మండలం, పట్టణం, మక్కువ, పాచిపెంట మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విశాఖపట్నం

**గాజువాక:** యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్, నాయకులు టి.అప్పారావు, ఎ. విజయకుమారి, వీణ, రిజ్వాన్, నిడదవోలు శ్రీనివాసరాజు, రాజు నాయుడు, ఎస్ వి.శ్రీనివాస్, ప్రసాద్, సబ్బారపు నూకరాజు, ఆర్.రాజిక్, ఎన్.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. సిఐటియు నాయకులు, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శులు మద్దతు తెలిపారు. గాజువాక, పెదగంట్యాడ, ములగాడ మండల నాయకులు, ఉపాధ్యాయుల నిరసన తెలిపారు.

**01.04.2026న**

యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్ అంబేద్కర్, విశాఖ జిల్లా జెఎసి చైర్మన్, జిల్లా గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, సహాధ్యక్షులు కె.ముత్యాలనాయుడు, కోశాధికారి కె. రాంబాబు, కార్యదర్శులు చుక్క సత్యం, రిజ్వాన్, ఎం రామకృష్ణ, వి. రామలక్ష్మి, శ్రీనివాసరావు, సంతోష్, ఆడిట్ కమిటీ కన్వీనర్ రియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి

యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయ్, ఏపీఎన్జీజిఓ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు, ప్రధానకార్యదర్శి, ఖజానా శాఖ సంఘం నాయకులు శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు గుత్తుల సూర్యప్రకాష్, వైరాల రమేష్రవు, ఆడిట్ కమిటీ కన్వీనర్ బైలపూడి దేముడు నాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్‌వీఎస్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

**భీమునిపట్నం:** యుటిఎఫ్ నాయకులు దాసరి నాగేశ్వరరావు, అనకాపల్లి పైడిరాజు, సిహెచ్ సంతోష్, ఎం.రామకృష్ణ, ఎల్‌ఎ. శ్రీనివాస్, జి మహేష్, ఎంవిఎస్. ప్రసాద్, గిరి, సంజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ పైలా రామారావుకు వినతి పత్రం అందజేశారు.

**నర్సీపట్నం రూరల్:** డివిజనల్ కార్యదర్శి చిట్టయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాంబమూర్తి, శోభన్ బాబు, కోటవురంట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింగరావు, ప్రధాన కార్యదర్శి జేవీ ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు ఏవి లోవరాజు, జల్లూరి ప్రసాదు, నాగభూషణ్, గొలుగొండ మండల అధ్యక్షుడు సిహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

**01.04.2026న**

